

మంగళవారం న్యూఢిల్లీలో ఖర్గేకు గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న సిఎం రేవంత్

## గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధాని, రాహుల్!

>> బీహార్– మంత్రి వివేక్ వెంకటస్వామి, హిమాచల్ ప్రదేశ్ –మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఒడిశా– మంత్రి వాకిటి శ్రీహరి, మహారాష్ట్ర – మంత్రి అజారుద్దీన్, ఢిల్లీ సిఎం, కేంద్ర మంత్రులు, గవర్నర్లకు మన రాష్ట్ర ఎంపీలు ఆహ్వానం అందిస్తారు. ఈ నెల 4 న వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను, గవర్నర్లను, కేంద్ర మంత్రులను, ఇతర ప్రముఖులను కలిసి గ్లోబల్ సమ్మిట్ కు ప్రత్యేకంగా ఆహ్వానం అందించాలని మంత్రులకు, ఎంపీలకు సిఎం బాధ్యతలు అప్పగించారు.

**మల్లిఖార్జున ఖర్గేను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసిన సిఎం రేవంత్‌రెడ్డి**

మంగళవారం రాత్రి సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చేరిన వెంటనే డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను, ఎంపీలను వెంట తీసుకుని ఎఐసిసి అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గేను కలిశారు. ఆయన నివాసంలో కలిసి భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## పార్లమెంటులో చర్చ

>> మధ్యాహ్నం ఎన్నికల సంస్కరణలపై చర్చ నిర్వహించాలని నిర్ణయించినట్లు రిజిజు వివరించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సర్‌పై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబడుతూ సభా కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నాయి. సభలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించడానికి స్పీకర్ ఓం బిర్లా బిఎసి సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రాయాల మేరకు ఎన్నికల సంస్కరణల కింద ఎస్ఐఆర్‌పై చర్చను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఆ మేరకు డిసెంబర్ 9, 10 తేదీల్లో అనగా, మంగళవారం, బుధవారం సర్‌పై చర్చించాలని నిర్ణయించారు. ఇక డిసెంబర్ 8న వందేమాతరం 150వ వార్షికోత్సవంపై చర్చను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించనున్నారని కిరణ్ రిజిజు తెలిపారు.

**రెండు దశల్లో జన, కుల గణన.. లోక్‌సభలో కేంద్రం ప్రకటన**

దేశవ్యాప్తంగా జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తొలి దశ 2026 ఏప్రిల్– సెప్టెంబర్ మధ్య, రెండో దశ 2027 ఫిబ్రవరిలో జరుగుతుందని మంగళవారం లోక్ సభకు తెలిపింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నకు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జనగణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ వివరించారు.

## ఇక డ్రోన్ల తయారీ

>> సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా పరిశీలించారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్షించారు. పలు దేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్, అతిథులు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమ్మిట్ వేదిక వద్ద నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 5వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేసి.. 6వ తేదీన డ్రై రన్ కండక్ట్ చేయాలని ఉన్నతాధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీగా ప్రతినిధులు హైదరాబాద్ తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అలాగే భద్రతను సైతం కట్టుదిట్టం చేస్తుంది. అందుకోసం డీజీపీ శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

## ఇమ్రాన్ అనారోగ్యంపై వెల్లువెత్తిన నిరసనలు

### జైల్లో ఆయన పరిస్థితిపై విభిన్న అభిప్రాయాలు

**రావల్పిండి, డిసెంబరు 2:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆయనను కలిసేందుకు పార్టీ నేతలకు, కుటుంబ సభ్యులకు కూడా అనుమతి లభించకపోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి నిరసనగా నేడు ఇస్లామాబాద్ హైకోర్టు, రావల్పిండిలోని అదియాలా జైలు వెలుపల ఆందోళనలు చేపట్టనున్నట్లు పీటీఐ ప్రకటించింది. ఇమ్రాన్ ఖాన్ మరణించారంటూ వదంతులు వ్యాపించడంతో ప్రభుత్వం ఇస్లామాబాద్, రావల్పిండి నగరాల్లో మూడు రోజుల పాటు సెక్షన్ 144 విధించింది. ఈ నిరసనల గురించి పీటీఐ నేత అసద్ ఖైసర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఉభయ సభల సభ్యులు తొలుత ఇస్లామాబాద్ హైకోర్టు వద్ద సమావేశమై, అక్కడి నుంచి అదియాలా జైలు వరకు ర్యాలీగా వెళ్తారని తెలిపారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను జైలు అధికారులు అమలు చేయడం లేదు. అందుకే నిరసన చేపట్టాలని నిర్ణయించామని ఆయన స్పష్టం చేశారు.

**జైలులో ఇమ్రాన్‌ను మానసికంగా వేధిస్తున్నారు!: ఇమ్రాన్‌సోదరి**

రావల్పిండిలో ఉన్న అడియాలా జైలులో ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంగానే ఉన్నారని, అయితే మానసికంగా ఆయన్ను తీవ్రంగా వేధిస్తున్నారని అయినా ఆయన ధృఢంగా మనో నిబ్బరంతో ఉన్నారని ఆయన సోదరి ఉజ్మా ఖాన్ వెల్లడించారు. రావల్పిండిలోని అడియాలా జైలులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఆమె కలిశారు. సోదరుడ్ని పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. ఇమ్రాన్ ఖాన్ మానసికంగా చాలా ధృఢంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విరుద్ధ పాలనకు వ్యతిరేకంగా ప్రజలకు, అలాగే పీటీఐ పార్టీకి ఆయన సందేశాన్నిచ్చారని తెలిపారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ జైలులో తనను మానసికంగా వేధిస్తున్నారని ఇమ్రాన్ ఖాన్ చెప్పినట్లు ఉజ్మా పేర్కొన్నారని స్థానిక మీడియా వెల్లడించింది. జైలులో తనకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారని ఆమె తెలిపారు.

## దేశంలోనే తొలి మహిళా ఫుట్ బాల్ అకాడమీ హైదరాబాద్‌లో..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్2:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో క్రీడారంగానికి సంబంధించి కీలక అడుగు పడనుంది. దేశంలోనే తొలి మహిళా ఫుట్ బాల్ అకాడమీ తెలంగాణలో ఏర్పాటు కానుంది. హాంకాంగ్ తరవాత ప్రపంచంలోనే రెండో మహిళల ఫుట్ బాల్ అకాడమీ ఇదే కావడం విశేషం. దేశంలో రెండో పురుషుల ఫుట్‌బాల్ అకాడమీ కూడా తెలంగాణలోనే ఏర్పాటు చేయనున్నారు. డిసెంబరు 8,9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే సదస్సులో తెలంగాణ ఫిఫా– ఏఐఎఫ్ఎఫ్ ఫుట్ బాల్ అకాడమీలు వివరాలను ప్రకటించనున్నాయి. వీటితో పాటు హైదరాబాద్ అంతర్జాతీయ చెస్ నిర్వహణకు సంబంధించిన ప్రకటన కూడా సదస్సులో వెలువడనుంది.

## రూ.792 కోట్ల ఫాల్కన్ గ్రూప్ స్కామ్‌లో ఇడి కీలక చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్2:** భారీ మొత్తంలో ఇన్వెస్టర్లను మోసం చేసిన ఫాల్కన్ గ్రూప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. సుమారు రూ.792 కోట్ల ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ స్కామ్‌లో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ కుమార్ కంపెనీకి చెందిన హాకర్ 800ఏ ప్రైవేట్ విమానాన్ని వేలం వేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఈ వేలం ద్వారా వచ్చే మొత్తాన్ని స్కామ్ బాధితులకు నష్టపరిహారంగా చెల్లించనున్నట్లు ఈడీ స్పష్టం చేసింది. ఈడీ పేర్కొన్న ప్రకారం, ఫాల్కన్ గ్రూప్ పేరుతో అమర్‌దీప్ కుమార్ నకిలీ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పథకాన్ని ప్రారంభించి, అనేక మంది నుంచి రూ.792 కోట్లు వసూలు చేసి మోసం చేశాడు. ఈ కేసులో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం 2025 ఫిబ్రవరి 11న మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, వాటి ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అయితే, ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడానికి ముందే అమర్‌దీప్ కుమార్ ఇదే విమానంలో దేశం విడిచి పారిపోయినట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు. ఈ కేసులో భాగంగా ఈడీ 2025 మార్చి 7న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమానాన్ని స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఈ విమానం బేగంపేట ఎయిర్ పోర్టులో ఉంది. డిసెంబర్ 9న ఎంఎస్టీసీ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ వేలం జరగనుంది. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 7 వరకు ఈ విమానాన్ని పరిశీలించవచ్చని ఈడీ తెలిపింది.

## వారం - వర్జ్యం

03-12-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
త్రయోదశి మ.12.24
భరణి సా.5.57, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : తె.4.25 - 5.49
దు.ఉ.11.36-12.21
శుభసమయం:ఉ.9.30-10.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** సనాతన విద్యల పట్ల ఆసక్తి కనబరుస్తారు. నరదృష్టి అధికంగా ఉంటుంది. వెన్ను నొప్పి బాధిస్తుంది.

**వృషభం:** ఒక సమస్య తీరితే మరో సమస్య పరిష్కరించుకోవలసి వస్తుంది. వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు.

**మిథునం:** సౌందర్య సాధక విట్మాలు పాటిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :** నిష్కారణమైన వేధింపుల నుండి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తారు. వాహన సౌఖ్యం.

**సింహం:** కొత్త ఒప్పందాలతో తొందర పాటు వద్దు. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. వస్తు సౌలభ్యం.

**కన్య :** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**తుల :** మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు అధికంగా ఉంటారు. తగు జాగ్రత్తలు పాటించండి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** పనులు మందకొడిగా సాగుతాయి. ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రతిష్టకు ఎక్కువ విలువను ఇస్తారు.

**ధనుస్సు:** బాధ్యతలు అధికమవుతాయి. ఉద్యోగులకు బదిలీలు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** దూరప్రయాణాలు లాభిస్తాయి. ఉపయుక్తం లేని అంశాలు ఈ రోజు కాలహరణానికి కారణం అవుతాయి.

**కుంభం:** కోర్టు, తీర్పులు, పంచాయితీలు, అలసటకు, ప్రయాసకు గురి చేస్తాయి. వివాదాలకు దూరంగా ఉండండి. వస్త్రాలాభం.

**మీనం :** ఒకటి రెండు సార్లు ఆలోచించి నిదానంగా అడుగువేయడం మంచిది. కాంట్రాక్టులు దక్కుతాయి. ధన లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎర్త్‌సైన్స్ వర్సిటీ ఓ దిక్సూచి

>> ప్రాంతమేఅని కొనియా డారు. అరవై ఏళ్ల ఆకాంక్షను మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు నెరవేర్చారని, అందుకే ఈ యూనివర్సిటీకి దేశంలోనే మొట్టమొదటి సారిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరున నామకరణం చేశామ న్నారు.. తెలంగాణ కలను సాకారం చేసిన ఆయనను గత ప్రభుత్వం విస్మరించిందని, చేసిన మేలులను ఆ ప్రభుత్వం మరిచినా తాము మాత్రం మరువబోమని, 20042014 వరకు సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపించిన మన్మోహన్ సింగ్ ఒక గొప్ప మేదావి అని, అందుకే ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి ఈ పేరు పెట్టుకున్నామన్నారు. గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురైందని, బీటలు బారిన నేలలో నీళ్లు పారిస్తామని, సీతారామా ప్రాజెక్టును పూర్తి చేసి ఈ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో అన్ని రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, రైతుల కళ్లలో కన్నీళ్లు పారితే కేసీఆర్ కుటుంబంలో కనకవర్షం కురిసిందని ఆరోపించారు.

**ఈ జిల్లా నుంచే ముగ్గురు మంత్రులు ఉన్నారు..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నారని, వారి వద్దే అన్ని కీలకమైన శాఖలు ఉన్నాయని, వారు తలచుకుంటే ఈ ఉమ్మడి జిల్లాకు జరగనిదంటూ ఏమీ ఉండదని అన్నారు. సంపూర్ణ మెజార్టీ ఇచ్చిన ఈ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, సాగునీటి ప్రాజెక్టులకు, భద్రాద్రి రామాలయం వరకు కొత్త రైల్వే మార్గంతో పాటు జిల్లాలో విమానాశ్రయం, కేటీపీఎస్ లో కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. దేశంలో ఉన్న ఆకలి కేకలను చూసి ప్రపంచంతో పోటీ పడాలని దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఎన్నో కలలు ఉన్నారని, ఎడ్యుకేషన్ పాలసీలు, ఇరిగేషన్ ప్రాజెక్టులను తీసుకొచ్చి ఈ దేశముఖ చిత్రాన్నే మార్చారని, ఆయన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం వైపు ప్రపంచమే చూసేలా ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీలను మరింత అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ భవనాలను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని, ఇది దేశానికే ఒక తలమానికంగా నిలుస్తుందని చెప్పారు. బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు.

**ఖమ్మం జిల్లాలో అపారమైన ఖనిజ సంపద**

ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు. గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు.

అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టిన యూనివర్సిటీని ఆయన స్థాయిలోనే ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈరోజు భూమి పూజ చేసుకున్న దేశంలోనే అత్యున్నత యూనివర్సిటీని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా బిల్డింగులు, సకల సౌకర్యాలు పూర్తి చేస్తాం అందుబాటులోకి తీసుకువస్తాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈరోజు కొత్తగూడెంలో భూమి పూజ చేసుకున్న హెల్త్ సైన్స్ యూనివర్సిటీ కార్యక్రమం రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఓ పెద్ద కార్యక్రమం అని అన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించి నందుకు ప్రజల తరపున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ... కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుల గుబులు

### ఒకే పోలిక గుర్తులతో చిక్కులు

### 'తెలుగు అక్షరమాల'తో మరికొన్ని సమస్యలు

### నేటి సాయంత్రానికి ఖరారు చేసే అవకాశం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల గెలుపోటములు గుర్తులు ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో సర్పంచ్, వార్డుమెంబరు బరిలో దిగిన అభ్యర్థులు గుర్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకం కానున్న సేపథ్యంలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తులు గుబులు పుట్టిస్తున్నాయి. ఓటర్లు తన గుర్తును సులభంగా గుర్తించే గుర్తురావాలని ఆశిస్తున్నారు. తండాలు, గ్రామాల్లో ఎక్కువ శాతం మంది నిరక్షరాస్యులు, వృద్ధులైన ఓటర్లు ఉంటారు. గ్రామీణ ఎన్నికల బ్యాలెట్ పత్రంలో నిరక్షరాస్యులు, వయసు పైబడ్డ వారికి అర్థం కాని కొన్ని గుర్తులు ఉండడంతో పోటీచేసే సర్పంచి అభ్యర్థుల్లో భయం పట్టుకుంది. కొన్ని గుర్తులు ఒకే పోలికతో ఉండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. పార్టీ పరంగా జరిగే ఎన్నికల్లోనైతే ఎవరికి ఏ గుర్తువస్తుందో ముందే తెలిసిపోతుంది. పంచాయతీ ఎన్నికలను ఎన్నికల సంఘం పార్టీ రహితంగా నిర్వహిస్తుండటంతో పార్టీలకు సంబంధించిన గుర్తులు కాకుండా ప్రత్యేక గుర్తులు కేటాయిస్తారు. డిసెంబరు11న మొదటి విడుత జరిగే 4236 గ్రామాల సర్పంచ్ అభ్యర్థులకు, 37440 వార్డుమెంబరు అభ్యర్థులకు బుధవారం సాయంత్రం వరకు గుర్తులు కేటాయిస్తారు. నామినేషన్‌లో రాసినవారి పేరు ఆధారంగా తెలుగు అక్షరమాల క్రమం అనుసరించి గుర్తులు కేటాస్తారు. ఇంటిపేరు ముందు రాస్తే ఇంటిపేరు మొదటి అక్షరం, వ్యక్తిపేరు ముందు రాసుకొంటే ఆ వ్యక్తి పేరు మొదటి అక్షరం అనుగుణంగా గుర్తులు కేటాయిస్తారు. సర్పంచ్‌కు 20, వార్డుమెంబరుకు 30 ప్రత్యేకంగా వేరు వేరు గుర్తులు కేటాయించారు. నోటాకు అదనంగా గుర్తు కూడా ఉంటుంది. బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల ఫొటోలు, పేర్లు ఉండవు. కేవలం గుర్తులు మాత్రమే ముద్రిస్తారు. ఈ క్రమంలో ఓట్లు తారుమారైతే అభ్యర్థుల భవితవ్యం అగమ్యగోచరం కానుందనే భయం వారిని వెంటాడుతోంది. వార్డుమెంబరుకు తెల్లటి బ్యాలెట్‌పేపర్‌పై గౌను, గ్యాస్‌స్టౌవ్, స్టూల్, గ్యాస్‌సిలెండరు, బీరువా, ఈల, కుండ, డిష్‌యాంటీనా, మూకుడు, గరాట, ఐస్‌క్రీమ్ గ్లాసు, పోస్ట్‌డబ్బా, కవర్, హాకీస్టిక్ బాల్, నెక్‌టై, కటింగ్‌ప్లేయర్, పెట్ట, కరెంటుపోల్ టికెటిల్ వంటివి ముద్రించి ఉన్నాయి. సర్పంచ్ అభ్యర్థుల బాలెట్ పేపర్ గులాబి రంగులో ఉంటుంది దానిపై నోటా గుర్తుకూడా ఈసారి కొత్తగా చేర్చినారు. సర్పంచ్ అభ్యర్థులకు ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీపర్సు, టివి రిమోట్, టూత్‌పేస్టు, స్పానర్, చెత్తడబ్బ, బ్లాక్‌బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టి జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్ బ్రష్, బ్యాట్స్‌మెన్, మనిషి, తెరచాపపడవ, బిస్కెట్ పిల్లనగ్రోవి, చైన్ చెప్పులు, గాలిబుడగ, క్రికెట్ స్టంప్స్‌లు ఉన్నాయి. ఈ గుర్తులు గ్రామీణులు గుర్తుపట్టకపోతే అభ్యర్థికి ఇబ్బంది తప్పదు. సాధారణంగా కేంద్ర ఎన్నికల సంఘంతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకే గుర్తుకు సరితూగే అనేక గుర్తులు తలనొప్పి తెస్తుంటే వచ్చే ఏడు రోజుల్లో తమ గుర్తు ప్రజల్లోకి తీసుకొని వెళ్ళడం కొంచం కష్టంగానే ఉంటుంది. బిఆర్ఎస్ రాజకీపార్టీకి రోటిమేకర్, రోడ్‌రోలర్, హ్యాట్ వంటివి ఇబ్బంది పెడుతుంటాయి. సైకిల్, చీపు వంటి చిహ్నాం కలిగిన అనేక పార్టీలు కూడా తమ ఓట్లు ఒకే నమూనా ఉండే గుర్తులతో గల్లంతు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తుంటాయి. అందరికీ తెలిసే మంచం, పలక, చెప్పులు, పడవ, కొబ్బరి చెట్లు వంటివి ఎక్కడో ఆఖర్లో పెట్టారు. గ్రామీణులకు చాలా మందికి తెలియని వజ్రం కూడా బ్యాలెట్‌లో గుర్తుగా ఉండటం విషాదం.




మంగళవారం పార్లమెంటు ఆవరణలో 'సర్'కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రాహుల్, సోనియా, ప్రియాంక

# పవన్ వ్యాఖ్యలపై తెలంగాణలో రగడ

>> వెంకట్, అద్దంకి దయాకర్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ నాయకుల నుంచి డిమాండ్లు వినిపించాయి. ఈ క్రమంలో జనసేన నుంచి ఈ ప్రకటన వెలువడింది. తెలంగాణపై పవన్ కళ్యాణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకొని, తక్షణమే పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణను దుర్మార్గంగా కలిపినందుకు 60 ఏళ్లు మేము బాధపడ్డామని, ఫ్లోరైడ్ నీళ్లు తగినము. మా నిధులు, నీళ్లు, ఉద్యోగాలు తీసుకుకెళ్ళారని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో సంపాదించిన పైసలతో విజయవాడ, వైజాగ్ మిగితా ప్రాంతాలను డెవలప్ చేసుకున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ కొత్తగా రాజకీయాల్లోకి వచ్చారు, మంచి చేయాలని ఉద్దేశం తో వచ్చి ఉంటారు, కానీ ఇలాంటి వ్యాఖ్యలు సరికాదు అని హెచ్చరించారు. చిరంజీవి మంచి వ్యక్తి ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయరు. పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్తేనే నైజాంలో రెండు రోజులైనా సినిమాలు ఆడుతాయనీ లేదంటే సినిమా నడువదు సినిమాటోగ్రఫీ మంత్రిగా చెపుతున్న అని ఆయన మండిపడ్డారు. పవన్ కల్యాణ్ చేసిన దిష్టి వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ ప్రజల దిష్టి తగలడమే కారణమంటూ పవన్ కల్యాణ్ చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యలపై పొన్నం తీవ్రంగా స్పందించారు. "మీ సముద్రం నుంచి వచ్చే తుపాను మా రాష్ట్రాన్ని ముంచేస్తున్నా మేమెవరినీ తప్పుబట్టలేదు. అది ప్రకృతి అని భావించాం. కానీ డిప్యూటీ సీఎం స్థాయిలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడతారా? కోనసీమపై మేమెందుకు దిష్టి పెడతాం?" అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అన్నదమ్ముల్లాంటివని, ఇలాంటి వ్యాఖ్యలు ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య అగాధాన్ని సృష్టిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తులో ఉన్న ప్రభుత్వ ప్రతినిధి ఇలా మాట్లాడటం బాధాకరమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ నాయకత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. రాజకీయం రెండున్నర గంటల సినిమా స్క్రిప్టుకాదని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండు ప్రాంతాల ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి దుయ్యబట్టారు మీరు గెలిచిన తర్వాత కోనసీమకు దిష్టి తగిలినట్టుందని, అక్కడ ఉన్న సమస్యల పైన మాట్లాడండి ఇష్టమున్నట్లు మాట్లాడటం తగదని ఆయన హెచ్చరించారు.

**కాంగ్రెస్ మంత్రులు స్పృహలో లేరు.. జగదీశ్ రెడ్డి ఫైర్**

కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై పది రోజుల తర్వాత స్పందించిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మంత్రులు స్పృహలో లేరని విమర్శించారు. కొందరు వాటర్‌లో నీళ్లు కలుపుకుని స్పృహ కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. మరికొందరు కమిషన్లు పంచుకునే పనిలో బిజీగా ఉన్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై పది రోజులకు స్పందించడం హాస్యాస్పదమని జగదీశ్ రెడ్డి అన్నారు. ఒక ప్రాంతం, ఒక మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలని సూచించారు. ఉద్యమ సమయంలో తామెప్పుడూ ప్రాంతాలను దూషించలేదని తెలిపారు. అన్నదమ్ములుగా విడిపోయి వేర్వేరుగా కలిసి బతుకుదామని కేసీఆర్ ఆనాడే చెప్పారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ నీడలో హైదరాబాద్‌లో ప్రశాంతంగా ఉన్నామని ఏపీ ప్రజలే చెప్పారని గుర్తుచేశారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటే మంచిదని హితవుపలికారు.

పవన్ కళ్యాణ్ సినిమాలను ఆపుతామని ఇక్కడి మంత్రి కామెడీగా మాట్లాడుతున్నారని కోమటిరెడ్డిని ఉద్దేశించి జగదీశ్ రెడ్డి విమర్శించారు. వాస్తవానికి అభిమానం వేరు.. రాజకీయం వేరు అని చెప్పారు. తమ అభిమాన హీరోగా ఎవరి సినిమాలనైనా ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. పది రోజుల తర్వాత కాంగ్రెస్ మంత్రులు స్పందించిన తీరు ఇద్దరిలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్టుందని విమర్శించారు. ఈ వివాదంలో తెలంగాణ బిజెపి నేతలు మౌనంగా ఉన్నారు.

## పార్టీ అభ్యర్థులనే గెలిపించండి

>> నిర్వహిస్తామని తెలిపారు. నూతన డిసిసిఅధ్యక్షులకు స్వాగతం అభినందనలు అంటూ ఆమె తన ప్రసంగంను మొదలు పెట్టడమే కాకుండా కొత్తవారిని పారదర్శకంగా ఎంపిక చేశామని వివరించారు. మొట్ట మొదటి సారిగా ఎఐసిసిఅబ్జర్వర్స్ క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్యానెల్ ద్వారా డిసిసిలను నిష్పాక్షికంగా ఎంపిక చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టిపిసిసి అధ్యక్షులు వారి సొంత జిల్లాలో కూడా వారు ఎవరి పేరు ప్రతిపాదించలేదని ఆమె తెలిపారు. కేవలం ప్యానల్ ద్వారా మాత్రమే డిసిసిల ఎంపిక చేశారని అన్నారు. అందరి సమన్వయం వల్లే సమర్థులైన డిసిసిల ఎంపిక జరిగిందన్నారు. డిసిసిల పనితీరు ఆధారంగా ప్రభుత్వంలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. పదవీకాలం ముగిసిన డిసిసిలతో కలిసి నూతన డిసిసిలు సమన్వయం చేసుకుంటూ పార్టీ ఎజెండాను ముందుకూ తీసుకెళ్లాలని కోరారు.

ప్రభుత్వపనితీరుకు అనుగుణంగా ఫలితం ఉంటుంది: వారంరోజుల్లో కార్పొరేషన్ పదవుల పందేరం : మహేష్‌కుమార్‌గౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ళకాలంలో ఆరుగ్యారెంటీల్లో మెజార్టీ పథకాలు ప్రజలకు అందిస్తున్నదని తప్పకుండా ప్రభుత్వపనితీరుకు అనుగుణంగా తగిన గుర్తింపు ఉంటుందని రాబోయే ఎన్నికల ఫలితాలు మనకు అనుకూలంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అణగారిన వర్గాల కోసం కష్టపడుతున్నారనీ దీనితో కెసిఆర్ శకం ముగిసిందని ఆయన జోస్యం చెప్పారు. వాటాల పంచాయతీ లో తేడా వల్ల కేసీఆర్ కుటుంబంలో కొట్లాడుకొంటుందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో మండలకమిటీలు బ్లాక్ అధ్యక్షుల నియామకం చేసి సంస్థగతంగా పార్టీకి పూర్తి నిర్మాణం ఇవ్వాలని సూచించారు. నూతన డిసిసిలకు స్వాగతంతెలిపారు. గుజరాత్ లో ఎఐసిసి సమావేశములో రాహుల్ గాంధీ, ఖర్గే సూచన మేరకు సంఘటన శ్రీ అభ్యయాన్ మేరకు డిసిసి అధ్యక్షుల ఎంపిక జరిగిందని అన్నారు. మల్లికార్జున ఖర్గే సూచన మేరకు క్షేత్ర స్థాయిలో సోషల్ ఇంజనీరింగ్ ఆధారంగా డిసిసిల ఎంపిక ప్రక్రియ చేపట్టామని అన్నారు. నూతన డిసిసి ఎంపికలో సామాజిక న్యాయం సూత్రంఉందని చెప్పారు నూతన డిసిసి లో మెజార్టీ బిసిలకు స్థానం లభించింది. అణగారిన వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు... సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు వారం పది రోజుల్లో కార్పొరేషన్ తో పాటు పెండింగ్ లో ఉన్న పదవుల భర్తీ చేస్తాం అని అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ లు భర్తీ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## ఒయు మైనింగ్ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 2 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సి టీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థి ఓ.యూలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఓయూ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య ఉస్మానియా యూని వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మైనింగ్ ఇం జినీరింగ్ విభా గంలో బీ టెక్ రెండో



రెడ్డి విజ్ఞాన్‌తేజ్ (ఫైల్)

సంవత్సరం చదువు తున్న రెడ్డి విజ్ఞాన్‌తేజ్ (19) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒయూ ఆక్సి జన్ పార్కులో రాత్రి చెట్టుకు ఉరి వేసు కుని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా, శంకరపట్నం, మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన విజ్ఞాన్ తేజ్ డిప్లొమా పూర్తి చేసి బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందారు. కిన్నెర హాస్టల్లో ఉంటూ తరగతులకు హాజరవుతు న్నాడు. సోమవారం మధ్యాహ్నమే తరగతి గది నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో రాత్రి ఆత్మహత్యకు పాల్పడగా, దీనిని గమ నించిన విద్యార్థులు పోలీసులకు సమాచారం అందిం చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని హుటాహుటిన ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేం దుకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీ సులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యులు, ఓయూ ఉన్నతాధికారులు గాంధీ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాచుపల్లిలో విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (బాచుపల్లి), డిసెంబరు 2, ప్రభాత వార్త:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హాస్టల్లోని తన గదిలో సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాచుపల్లి రెసిడెన్షియల్ కళాశాలలో ఇం టర్ మొదటి సంవత్సరం చదువుతున్న వర్షిత (16) సోమవారం తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి కూతురు అయిన వర్షిత ఎందుకు ఆత్మ హత్యకు పాల్పడిందో తెలియనిపరిస్థితి నెలకొంది. హాస్టల్ యాజమాన్యం సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న బాచుపల్లి పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలిం చారు. తోటి విద్యార్థినులు, వర్షిత తల్లిదండ్రుల నుండి వివరాలు తీసుకున్న అనం తరం వర్షిత ఆత్మహత్యకు కారణాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


# ప్రధాని కార్యాలయం పేరు 'సేవాతీర్థ్'గా మార్పు

### రాజ్‌భవన్‌లకు 'లోక్‌భవన్'లుగా నామకరణం

### ఆదేశాలు జారీచేసిన కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** దేశంలో వలసవాద గుర్తులను చెరిపేసే ప్రక్రియల్లో కేంద్ర ప్రభుత్వం వేగం పెంచింది. పలు రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌ల పేర్లను ఇప్పటికే 'లోక్ భవన్' లుగా మార్చిన కేంద్రం, తాజాగా ప్రధానమంత్రి కార్యా లయ (పీఎంవో) నూతన కాంప్లెక్స్‌కు కూడా కొత్త పేరును ఖరారు చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఈ భవన సముదాయానికి 'సేవా తీర్థ్' అని నామకరణం చేసారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరించే 'ప్రజలే ప్రథమం' అనే విధానానికి, నిస్వార్థ సేవకు ప్రతీకగా ఈ పేరును ఎంపిక చేశారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న ఈ కాంప్లెక్స్‌లో పీఎంవోతో పాటు కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయం ఉంటాయి. ప్రపంచ నేతలతో ఉన్నత స్థాయి సమావేశాల కోసం 'ఇండియా హౌస్' కూడా దీనిలో భాగంగా ఉంటుంది.

కొద్ది రోజులుగా ఉత్తరాఖండ్, కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోని రాజ్‌భవన్ల పేర్లను 'లోక్ భవన్'గా మార్చిన విషయం తెలిసిందే. ఈ పరం పరలోనే పీఎంవోకు కూడా కొత్త పేరు పెట్టా రు. గతంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రధాని నివాసం ఉండే రేస్ కోర్స్ రోడ్డును 'లోక్ కల్యాణ్ మార్గ్'గా, చారిత్రక రాజ్‌పథ్‌ను 'కర్తవ్య పథ్'గా,



సెం ట్రల్ సెక్రటేరియట్‌ను 'కర్తవ్య భవన్'గా మార్చింది. 'రాజ్' (పాలన) స్థానంలో 'సేవ', 'కర్తవ్యం', 'లోక్' (ప్రజలు) వంటి భావనలకు ప్రాధా న్యమిస్తూ పాలనా కేంద్రాలకు కొత్త పేర్లు పెడుతున్నారు. అధికారం కాకుండా బాధ్యత, సేవకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్న సందేశాన్ని ఈ మార్పుల ద్వారా స్పష్టం చేస్తున్నారు. అధికారిక సమాచార లేఖల్లో కూడా ఇండియా పదానికి బదులుగా భారత్ అని వాడుతున్నారు.

అలాగే బీటింగ్ రిట్రీట్ సెర్మనీల్లోని ఆంగ్ల గీతాలను తొలగించడం కూడా వలసవాదుల కాలం నాటి భావ జాలాన్ని తుడిచివేయడమేనని తెలు స్తోంది. నిజానికి ఈ సూచనలు 2024లో జరిగిన గవర్నర్ల సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. మోడీ సర్కారు ఈమార్పును దేశంలోని వలసవాదుల వారసత్వాన్ని తొలగించే ప్రక్రియగానే చూస్తోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, ఉత్తరా ఖండ్, ఒడిశా, గుజరాత్, త్రిపుర, లడ్డాక్ రాజ్‌భవన్‌లను లోక్‌సభవన్‌లుగా మార్చాయి. కేంద్ర హోం శాఖ జారీచేసిన ఉత్తర్వులకు అనుగుణంగానే రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌లు లోక్‌భవన్‌లుగాను, రాజ్‌నివాస్‌లు లోక నివాస్‌లుగాను మారుతున్నాయి.

# నగరంలోని ప్రముఖ హోటళ్లపై మళ్లీ ఐటి దాడులు

### భారీగా నగదు, నగలు, స్థిరాస్తి పత్రాల జప్తు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** నగరంలోని ప్రముఖ హోటళ్లుగా గుర్తింపు పొందిన ఉడ్‌బ్రిడ్జ్ సహా మరో రెండింటిపై మంగళవారం ఐటి దాడులు జరిగాయి. గత నెల 18, 19వ తేదీల్లో పిస్తా హౌస్, షాగౌస్, మెహ ఫిల్‌లపై రెండు రోజులపాటు ఐటి సోదాలు జరగడం తెలిసిందే. ఈ సందర్భంగా ఈ మూడు హోటళ్ల యాజమాన్యాలు భారీగా పన్ను ఎగవేతకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చినట్లు ఐటి అధికారులు ని ర్ధారించడం విదితమే. అప్పటి దాడుల సందర్భంగా వెల్లడైన పత్రాలు, ఇతరత్రా సమాచారం ఆధారంగా మంగళవారం నాడు ఉడ్ బ్రిడ్జ్‌తో పాటు మరో రెండు హోటళ్లపై ఐటి అధికారులు 20 బృందాలతో కేంద్ర బలగాల పహారా మధ్య సోదాలు నిర్వహించారు.

ఈ సోదాలు రాత్రి వరకు కొన సాగాయి. బిర్యానీకి కేరాఫ్‌గా నిలిచిన హోటళ్ల పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఐటి అధికారులు ఆధారాలు సేకరించి దాడులకు దిగినట్లు సమాచార ం. ప్రతీ యేటా వందల కోట్ల రూపాయల వ్యాపారాలు నిర్వహిస్తున్న ఈ హోటళ్ల ఆ స్థాయిలో పన్నులను చెల్లించడం లేదని ఐటి అధికారులకు సమాచారం అందడంతో దీని ఆధారంగా దాడులు జరిగినట్లు తెలిసింది.

ముందుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి కేంద్ర బలగాలతో ఐటి అధికారులు దాడులు నిర్వహించారు. ఈ హోటళ్లకు జంట నగరాలతోపాటు శివార్లలో, ఆఖరుకు విదేశాల్లోనూ బ్రాంచీలు వుండడంతో ఐటి అధికా రులు ప్రధాన శాఖతో పాటు ఆయా ప్రాంతాలలోని బ్రాంచీలలో సోదాలు చేబట్టారు.

హోటళ్ల ఛైర్మన్లు, డైరక్టర్ల ఇళ్లు, కార్యా లయాలలోనూ సోదాలు జరిగాయి. ఉడ్ బ్రిడ్జ్ హోటల్ నిర్వాహకుడు హర్షద్ అలీఖాన్‌ను ఐటి అధికారులు విచారించారు. సోదాల సందర్భంగా అక్కడ వున్న లెక్కలు, వాస్త వంలో వుండాల్సి న దాంట్లో భారీగా తేడాలున్నట్లు ఐటి అధికారులు గుర్తించారని తెలిసింది. భారీగా అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు ఐటి అధికారులు గుర్తించారు. దాడుల సందర్భంగా భారీగా నగదు, బంగారు నగలు, స్థిరాస్తి పత్రాలను జప్తు చేశారు.

## బాలికను చితకబాది, హింసించిన పాఠశాల ఆయా అరెస్ట్, రిమాండ్

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), డిసెంబరు 2, ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని షాపూర్‌నగర్‌కు చెందిన పూర్ణిమా విద్యానికేతన్ హైస్కూల్ ఘటనతో ఒక్కసారిగా మానవ హక్కుల సంఘాలు, రాజకీయ పార్టీలు గగ్గోలు పెట్టడంతో ఎట్టకేలకు విద్యార్థినిపై అమానుషంగా ప్రవర్తించిన ఆయాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల సర్కిల్ ఇన్ స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. షాపూర్ నగర్‌లోని పూర్ణిమా విద్యానికేతన్ హైస్కూల్‌లో నర్సరీ చదువుతున్న ఆయా కూతురుపై మరో ఆయా విచక్షణారహితంగా దాడీచేసిన సంఘటన విదితమే. అయితే ఈ తతంగాన్ని పాఠశాలకు ఆనుకుని ఉన్న ఒక ఇంటిపై నుండి చూస్తున్న ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో ఒక్కసారిగా పాటశాల ఆయా పైశాతికత్వం వెలుగుచూసింది. దీనిపై స్పందించిన వివిధ రాజకీయ పార్టీలు, మానవహక్కుల సంఘాలు ఆందోళనకు దిగడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ రమేశ్‌రెడ్డి పూర్ణిమా విద్యానికేతన్ పాఠశాలకు చేరుకుని వివరాలు సేకరించారు. కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమని కుమారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి పోలీసులకు అమ్మాయి తల్లి దండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ప్రత్యక్షంగా దాడికి దిగనట్లు విడియోపుటేజీలను జతపరిచి ఆయాను అరెస్టుచేసి మంగళ వారం రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు విషయంలో ఇప్పటికే మావనహక్కుల సంఘ ప్రతి నిధులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, పార్టీల నేతలు ప్రత్యేకశ్రద్ధతో ఆయాపై కేసు నమోదుచేసి ఆరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

# అక్రమ ఆయుధాలతో హత్యాయత్నం

### బీహార్ నుంచి ఆయుధాలు కొనుగోలు

### వ్యాపారిపై హత్యకు ప్రయత్నం

### పోలీసులకు చిక్కిన నిందితుడు

**కుమ్రంభీం జిల్లా ప్రతినిధి, డిసెంబరు 2, ప్రభాతవార్త :** అక్రమంగా ఆయుధాలు కొనుగోలు చేసి బెదరింపులకు పాల్పడి హత్యాయత్నం చేసిన నిందితుని అరెస్టు చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ వెల్లడించారు. మంగళవారం కుమురంభీం జిల్లా కౌటాల పోలీస్‌స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కౌటాల మండలానికి చెందిన బాధితుడికి గుర్తుతెలియని వ్యక్తి జూన్ 12న ఫోన్‌చేసి రూ. 50 లక్షలు మహారాష్ట్రలోని చంద్రపూర్ బస్టాండ్‌కు వచ్చి ఇవ్వాలని బెదరించాడు. పోలీసులు, మీడియాకు తెలిపితే తుపాకీతో కాల్చి చంపుతామని లేఖ రాసి ఫర్టిలైజర్ దుకాణం షట్టర్ వద్ద ఉంచాడు. సెప్టెంబరు 26న మరోసారి ఫోన్=చేసి డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదరించాడు. అక్టోబరు 15న బాధితుడి తమ్ముడు బైకుపై తన ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఆపడానికి ప్రయత్నించాడు. ఆపకుండా వెళ్లడంతో చంపడానికి ప్రయత్నించాడు. దీంతో ఆ బాధితుడు గుర్తుతెలియని వ్యక్తి భయబ్రాంతులకు గురి చేసున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదే చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు కౌటి సాండ్గావ్ గ్రామానికి చెందిన కుర్బంకర్ అజయ్ (31)ను మంగళవారం ఉదయం ముత్తంపేట క్రాస్‌రోడ్ వద్ద కౌటాల పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనబడడంతో అరెస్ట్‌చేసి పిస్తోల్, తపంచా (దేశికట్ట), రెండు మ్యాగజిన్‌లు, 15 చిన్నబుల్లెట్‌లు, ఒక పెద్దబుల్లెట్, ఐదు ఖాళీ కోకలు, సెల్‌ఫోన్, బైకు, ఇతర వస్తువులు స్వాధీనం చేసున్నట్లు ఎస్పీ తెలిపారు.




విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ నితికాపంత్

**నేరస్తుడు నేరం చేసిన విధానం..**

సులువుగా ఎక్కువ డబ్బులు సంపాదించాలని హిందీ సినిమాలు చూసి ప్రేరణపొంది బాగా డబ్బున్న వారిని బెదరించి, భయపెట్టి అవసరమైతే చంపైనా ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయిం చుకున్నట్లు నేరస్తుడు వివరించినట్లు ఎస్పీ తెలిపారు. దీనిలో భాగంగానే నేరస్తుడైన కుర్బంకర్ అజయ్ ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకుని జూన్ 11, 12 తేదీల్లో రాత్రి సమయంలో బెదరింపు లేఖలు రాసి, 50 లక్షలు ఇవ్వాలని లేదా బాధితుడిని, అతని కుటుంబసభ్యులను చంపుతామని రెండు లెటర్లు రాసి బాధితుడి ఫెర్టిలైజర్ షాప్ షెట్టర్ కు పెట్టాడు. ఈ నెల 2న బాధితుడు, అతని కుటుంబసభ్యులు ఫెర్టిలైజర్ షాపునకు ఉదయం వస్తారని తెలుసుకొని ఎలాగైనా కాల్చి చంపాలని ఉద్దేశంతో పిస్టోలు, మూడు బుల్లెట్లు తీసుకొని బైకుపై వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్నికల సందర్భంగా వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడి తన నేరాన్ని ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ అభినందించారు.

## ఖనిజాల అన్వేషణకు సిఎస్ఐఆర్‌తో సింగరేణి ఒప్పందం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గు కీలక ఖనిజాలను అన్వేషణ, వెలికి తీసేందుకు సీఎస్ఐఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్ఐఎంఎంటీ) తో పని చేసేందుకు సింగరేణి ఒప్పందం చేసుకుంది. సింగరేణి ప్రాంతాల్లో షేల్, మట్టి, సాండ్స్టోన్, గ్రానైట్ రాళ్లు, బొగ్గు ఫ్లై యాష్, బాటమ్ యాష్ లలో నిక్షిప్తమై ఉన్న ఖనిజాలను వెలికితీయనున్నారు. హైదరాబాద్‌లో మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఖనిజ రంగంలో పరస్పర సహకారం కోసం ఒప్పందంతో బలమైన ముందడుగు పడిందన్నారు.

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 02.12.2025

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు అయిన శ్రీ చామకూర రాజయ్య గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీ'గా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో 1) శ్రీ చామకూర రాజయ్య గారు అధ్యక్షులు, 2) శ్రీ కర్నాటి వెంకటయ్య గౌడ్ గారు ప్రధాన కార్యదర్శి, 3) శ్రీమతి చామకూర మమత గారు కోశాధికారి, ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము: ప్లాట్ నెం.32, ప్రెస్ కాలనీ, మన్సూరాబాద్, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500068. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, డి.టి.సి.పి. భవనము, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన 15 రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/-
అధ్యక్షులు
సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా

# తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు కంప్యూటర్ పరీక్ష తప్పనిసరి

### టైపిస్టులు, అసిస్టెంట్లుసహా పలు విభాగాలకు నిబంధన అమలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** తెలంగాణ ప్రభుత్వం పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని పెంచే దిశగా కీలక నిర్ణయం తీసు కుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, వేగం పెంచే లక్ష్యంతో పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్షను తప్పనిసరి చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.237ను జారీ చేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం ఉద్యోగులు కంప్యూటర్ పరీక్షలో కచ్చితంగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ జీఓ ప్రకారం నిర్దేశిత కేటగిరీల ఉద్యోగులు కంప్యూటర్ పరీక్ష పాస్ కావడంతో పాటు ఆఫీస్ ఆటో మేషన్ యంత్రాల వినియోగంలో కూడా నైపుణ్యం ప్రదర్శించాలి. జూనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ కమ్ టైపిస్టులు, సీనియర్, జూనియర్ స్టెనోగ్రాఫర్లు, యూడీ, ఎల్డీ టైపిస్టులు వంటి క్లరికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రభుత్వ దైనందిన కార్యకలాపాల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం.కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన వారిలో కొందరికి కంప్యూటర్ పరిజ్ఞానం తక్కువగా ఉండవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష ద్వారా ఉద్యోగులందరూ తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సి ఉంటుంది. ఫైళ్ల నిర్వహణ, డేటా ఎంట్రీ, కమ్యూనికేషన్ వంటి పనులు వేగవంతం కావడానికి ఇది దోహదపడుతుంది. పరీక్షలో ఉత్తీర్ణత సాధించని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. డిజిటల్ పాలనను పటిష్ఠం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## నకిలీ నోట్ల నేరగాళ్లపై పిడి యాక్ట్ నమోదు చేసిన కామారెడ్డి పోలీసులు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సంచలనం రేపిన నకిలీ 500 రూపాయల నోట్ల చలామణి కేసులో కామా రెడ్డి పోలీసులు పట్టుబడ్డ నేరగాళ్లపై పిడి యాక్ట్ నమోదు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ముగ్గురిపై పిడి నమోదు చేయగా మం గళవారం నాడు మరో ఇద్దరిపై దీనిని అమలు చేస్తూ జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర ఆదేశాలు జారీ చేశారు. నకిలీ 500 రూపాయల నోట్ల చలామణి మద్యం దుకాణాల వద్ద రాత్రి వేళల్లో జరగగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న కామారెడ్డి పోలీసులు తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్, బి హార్, యుపి, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో దాడులు చేసి 11 మంది నేరగాళ్లను అరెస్టు చేయడం, వీరి వద్ద నుంచి నకిలీ నోట్ల తయారీకి వాడే కం ప్యూటర్లు, ఇతర వస్తువులను జప్తు చేశారు.

ఈ కేసులో కీలక నిందితులైన లఖన్ కుమార్ దూబె, సత్యదేవ్ యాదవ్. సౌరబ్ దేలపై ఇప్పటికే పిడి అమలు చేయగా తాజాగా దివాకర్ చౌదరి, హరి నారాయణ భగత్‌లపై దీనిని ప్రయోగించారు. నిందితులు ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా జైల్లో రి మాండులో వున్నారు. కాగా పిడి ఉత్తర్వులను పోలీ సులు జైలు అధికారులకు అందజేశారు. పిడి కారణంగా నేరగాళ్లు ఏడాది పాటు జైల్లో నిర్బంధ ంలో మగ్గాల్సి వుంటుంది.

BAJAJ FINANCE

**బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన**

**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035**

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యూవెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యూవెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

నన్ను స్కాన్ చేయండి

(12-01-26) ఆర్మూర్ - అంబేద్కర్ చౌరాస్తా; PB56SGL14416822, 14435903, 14648179, 14732925, 14829865. బాన్సువాడ - బస్ స్టాండ్; PCV9SGL14607091, 14765670, 14829155, 14839567. భద్రాచలం - ఆర్‌టిసి బస్ స్టాండ్; PEK5SGL14558608. భోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL14511397, 14711646, 14853385, 14869037. భూపాల్‌పల్లి - మైన్ రోడ్; PCW2SGL14437475, 14498725, 14753693, 14896354,చౌటుప్పల్ - మార్కెట్ ఏరియా; PCW3SGL14706143. (13-01-26) గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL14415718, 14445629, 14536761, 14576650, 14692859, 14820935, 14873671. గజ్వేల్ - పిడ్బేడ్; PEJ6SGL14647941. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL14434400, 14599558, 14783260, 14900599, 14901556, 14916050. హుజూరాబాద్ - వరంగల్ రోడ్; PJH1SGL14412833, 14574675, 14890387. ఇబ్రాహింపట్నం - బీజీఎల్; P19WSGL14658244, 14752876, 14759983, 14917286. జగ్తియాల్ - ధర్మపురి రోడ్; PCW6SGL14705737. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PGM7SGL14913575. కామారెడ్డి - నిజామ్‌సాగర్ రోడ్; P86QSGL13510037, 13659890, 13659566, 14394676, 14400087, 14436515, 14638431, 14689007, 14709178, 14707132, 14754945, 14840348, 14867119. (15-01-26): కామారెడ్డి - విద్యా నగర్; PKQ4SGL14633524. కరీంనగర్ - సీవీఆర్ఎస్ రోడ్; PCW8SGL14476976, 14638349, 14692508, 14711616, 14871360, 14922728. ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL14348792, 14355896, 14493349, 14577227, 14600974, 14652160, 14690111, 14730625, 14818072, 14894550, 14908965, 14913293. ఖమ్మం - జమ్మిబండ చౌక్; PGG1SGL13464985, 13597129, 14349933, 14350358, 14376896, 14371464, 14477364, 14528603, 14754986, 14781079, 14815719, 14848937, 14867193, 14874728. కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్; PJV4SGL14715421, 14852843, 14886361. కోరుట్ల - బీజీఎల్; PV44SGL14583249, 14578224, 14832340, 14846639, 14847158. కొత్తగూడెమ్ - మధుర బస్తీ; PEJ5SGL14463989, 14735652, 14877367. (16-01-26): మంచెరియాల్ - హైదరాబాద్ రోడ్; PCW9SGL14828254. మణుగూరు - అశోక్ నగర్; PCX1SGL14848014. మెదక్ - టిఎల్ బ్రాంహ్మణ్ స్ట్రీట్; PCX2SGL14552274. మెట్‌పల్లి - మైన్ రోడ్; PEF7SGL14410854, 14418433, 14613264, 14754095, 14765127, 14825490, 14914159. మిర్యాలగూడ - బీజీఎల్; P7B7SGL14369431, 14368740, 14395145, 14635330. ములుగు - గాంధీ చౌక్; PJV5SGL13714043, 14388826, 14500813, 14517000, 14555350, 14705385, 14760147, 14839213, 14846036. నాగర్‌కర్నూల్ - బీజీఎల్; P21DSGL14375067, 14444524, 14622213, 14735846, 14826292, 14843733, 14866424. నారాయణ్‌పేట్ - నర్సిరెడ్డి చౌరాస్తా; PJH5SGL14356194, 14394068, 14661092, 14654418, 14759957, 14843826. (17-01-26) నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్; PCX3SGL14604719, 14605109. నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PCX4SGL14368979, 14374511, 14410669, 14533486, 14559549, 14575584, 14608813, 14704992, 14762311, 14751894, 14876665. నిజామాబాద్ - కపిలా హోటెల్ రోడ్; PB94SGL14841232. నిజామాబాద్ - వినాయక నగర్; PCX5SGL14354688, 14610058, 14691444, 14839678. పరిగి - బహార్‌పేట్; PMK2SGL14356443, 14827247. పర్కల్ - బస్ స్టాండ్; PJG8SGL14438481, 14462861, 14514332, 14557695, 14654668, 14689662, 14705170, 14707673, 14819975, 14841342, 14899008, 14911461. పట్టన్‌చెరు - బీజీఎల్; PY29SGL14530971. (19-01-26) పెద్దపల్లె - సుభాష్ నగర్; PEO3SGL14351456, 14439095, 14454189, 14479375, 14601576, 14653610, 14716296, 14828761. సహన్‌నగర్ వెంకటేశ్వర కాలోని; PCX7SGL14361958. సంగారెడ్డి - బీజీఎల్; P4D3SGL14437107, 14532209, 14877795, 14892498, 14914109, 14913411. సంగారెడ్డి - పాత బస్ స్టాండ్; PJG6SGL14752011. సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PCX8SGL14655061, 14893268. శంశాబాద్ - బీజీఎల్; PY30SGL14864823. సిద్దిపేట్ - మెదక్ రోడ్; PGM8SGL14350003, 14557365, 14606615, 14631073, 14736881, 14736969, 14871107, 14878016, 14874592, 14909523, 14909092. సిర్సిల్లా - మెయిన్ రోడ్; PB66SGL14373770, 14485410, 14775058, 14822116, 14866288. (20-01-26) సూర్యాపేట్ - గాంధీ విగ్రహం; PJG4SGL14467068, 14517638, 14602833, 14611662, 14682511, 14774557, 14784424, 14887725. తూప్రాన్ - రామాయంపేట్ రోడ్; PJT5SGL14559970, 14574067, 14602534, 14631923, 14713671, 14849609. తుర్కయాంజల్ - రాఘవేంద్ర నగర్; PLP1SGL14775178. వనపర్తి - రాజీవ్ చౌక్; PCX9SGL14561430, 14783720, 14819053. వరంగల్ - కెయు క్రాస్‌రోడ్; PGP7SGL14577153, 14635012, 14689206, 14784524, 14785679. వరంగల్ - స్టేషన్ రోడ్; P04ISGL14377523, 14877825. వరంగల్ - నూబేదారి; PB55SGL14775185, 14779072. యెల్లందు - బుగ్గవాగు; PGC4SGL13776926, 14655562, 14778042, 14794057, 14920725.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

ఏదైనా మంచి సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భావం, విమర్శలను భరించే సహనం ఉండాలి.

-షేక్ స్పియర్

# పౌష్టికాహార లేమి!

ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవై శాతం వరకు భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఏనాటి నుంచో చెప్తున్నది. ప్రజలు ఏ మేరకు పౌష్టికవిలువలు ఉన్న ఆహారం తీసుకుంటున్నారనేది దేశ ఆర్థిక పరిస్థితికి సంకేతాలుగా నిలుస్తుందంటారు. భారత్‌లో గత మూడు దశాబ్దాల్లో ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆహార అలవాట్లు కూడా మారిపోయాయి. సాగు భూములు పెరగడంతోపాటు వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం చోటు చేసుకోవడంతో ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. అయినా ఇప్పటికీ దేశంలో పదిహేను శాతం జనాభాకు ఆకలి బాధలు తప్పడం లేదని అనేక సర్వేలు వెల్లడి చేస్తున్నాయి.నూటపదిహేను దేశాల నుంచి సేకరించిన సమాచారంతో రూపొందించిన ప్రపంచ ఆకలి సూచి 2019లో భారత్ నూట రెండో స్థానం. దేశంలో ఇప్పటికే దాదాపు ఇరవై కోట్ల మందికి పైగా పౌష్టికాహార సమస్యలతో సతమతమవుతున్నారు. ఇందులో పదిహేను నుంచి నలభైఐదేళ్ల వయస్సు ఉన్న మహిళల్లో యాభైఒక్కశాతం అత్యంత బలహీనంగా ఉంటున్నారని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) నివేదిక స్పష్టం చేస్తున్నది. చాలా మంది రక్తహీనత సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు డెబ్బై శాతం సరైన పౌష్టికాహారం లభించక రకరకాల సమస్యలతో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో దాదాపు నలభైశాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఎన్నో నివేదికలు వెల్లడిస్తు న్నాయి. ఈ భూమ్మీద పుట్టినవారికి ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కనులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలక పెద్దలే. తల్లీబిడ్డకు పౌష్టికాహారం అందివ్వకపోవడం కూడా పాల కుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తుంది. అలాని పాల కులు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారు. లక్షల కోట్లు వెచ్చించారు. అయినా ఆశించిన ఫలితాలు లభించడం లేదు. ఇప్పుడు కొత్త చట్టాలు ప్రవేశపెట్టకపోతేపోయారు ఉన్న పథకాలను ఏమేరకు అమలు చేస్తున్నారో అర్హులైన వారిలో ఎంత మందికి అందిస్తున్నారో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నిశితంగా పరిశీలించి, పరిశోధిస్తే ఈ పథకాలకు కేటాయించిన నిధులు అక్రమ మార్గాలకు ఎలా మళ్లిస్తున్నారో దర్యాప్తు జరిపితే విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తాయి. పర్యవేక్షణ లోపం కారణంగా తల్లీబిడ్డకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా పటిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. భారత్‌లోనేకాదు, ప్రపంచ వ్యాప్తంగా కూడా పౌష్టికాహారలోపం పెచ్చరిల్లిపోతుందనే చెప్పొచ్చు. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకాల ఆహార సమస్య అధికంగా ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు పౌష్టికాహారాన్ని అందించేందుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు,స్వచ్ఛంద సేవాసంస్థలు, నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధి పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రధాన మంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎన్నో కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. పౌష్టికాహార లక్ష్యంగా పని చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాలు ఆ దిశగా అడుగులు వేయ లేకపోతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా అయ్యే సరుకుల్లో నాణ్యత లోపిస్తున్నట్లు ఏనాటి నుంచో ఆరోపణలున్నాయి. అప్పుడప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినప్పుడు చర్యలు తీసుకుంటాం, పునరావృతం కాకుండా చేస్తామంటూ చెప్తున్నారే తప్ప ఆచరణలో జరగడం లేదు. ఇంకొకపక్క పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మరింత చొరవ తీసుకొని సన్న బియ్యాన్ని ఈ పథకం ద్వారా అందిస్తున్నది. ఈ పథకం పట్ల సన్నజనం ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నది. గతంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా వస్తున్న దొడ్డు బియ్యాన్ని తినలేక ఐదో, పది రూపాయలకు కిలో అమ్ముకునేవారు. అప్పుడు అది దళారులకు ఒక కవ చంగా మారిపోయి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. పథకాలు, ఉద్దేశ్యాలు అన్ని సక్రమంగా ఉన్నా సంతృప్తి కల్పించే విధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా ప్రస్తుతం ఉన్న పథకాలను సవరించి, పర్యవేక్షణను మరింత పటిష్టం చేస్తే కొంతవరకైనా లక్ష్యాన్ని చేరుకుంటాం. ప్రజలకు పౌష్టికాహారం లభించి ఆరోగ్యవంతమైన భారత్ వర్ధిల్లుతుంది.

హింసకూ హేతువు అహంకారం. అహంకారమే స్వపరభేదాలను సృష్టిస్తుంది. ఈ విభేదాలు హింసకు దారితీస్తాయి.



శ్రీరమణ మహర్షి

ఇచ్చింది మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకముంచుకోవడమే స్నేహం.



మహాత్మ గాంధీ

# ప్రజావాక్కు



### కళల్లో ఫిలిగ్రీ శిల్పకళ ఒకటి

కరీంనగర్‌కు ప్రత్యేకమైన ప్రతిష్ఠను తీసుకువచ్చిన కళల్లో ఫిలిగ్రీ శిల్పకళఒకటి.శతాబ్దాలుగా వెండి నూలుపోగులతో అద్భుతమైన సంక్లిష్ట ఆకృతులను సృష్టించే ఈకళ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచింది. ఇటువంటి అరుదైన, అద్భుతమైన కళను ప్రధానమంత్రి తన 'మన్ కి బాత్'లో ప్రస్తావించడం కేవలం ప్రశంస మాత్రమే కాదు, కళాకారులకే కాదు ప్రాంతానికే గర్వ కారణం, భవిష్యత్తుకు ఆశాజ్యోతి కూడా. తరతరాలుగా తమ కుటుంబ సంప్రదాయంగా ఈ కళను కొనసాగిస్తున్న శిల్పకారులకు ఈ గుర్తింపు మహత్తర ప్రోత్సాహం. వారి నైపుణ్యం, సహనం, అనుభవం వంటి విలువైనఅంశాలు దేశ ప్రజలకు తెలియజేయడానికి ఇది గొప్ప అవకాశం. ఈ గుర్తింపు కొత్త మార్కెట్లు, ఆన్‌లైన్ వేదికలు, అంతర్జాతీయ అవకాశాలు వంటి కొత్త తలుపులు తెరవగలదు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### 34 జీవోను అమలు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్నవిద్యావైద్య ఇతరఉద్యోగులకు7ఆగస్టు 2025 రోజున ప్రకటించిన 34జీవోను అమలుచేయాలి. వికలాంగుల ఉద్యోగులకు బదిలీలు. డిప్యూటేషన్‌కు సంబంధించి తీసిన34జీవో ప్రకారం వారికి అనుకూలమైన ప్రదేశంలో విధులునిర్వహించే విధంగా వారివైకల్యం, ఆరోగ్య, మానసిక,కుటుంబ అవసరాలను దృష్టిలోపెట్టుకొని వారు కోరుకున్నచోటవిధులు నిర్వహించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. ఉద్యోగ వికలాంగుల కు సంబంధించిన 34 జీవోను కచ్చితంగా అమలు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

భారతదేశం వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటినుంచో సామాజిక,ఆరోగ్య,ఆర్థిక సమస్యలకుమూలమై ఉంది. గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తి వల్లే పెరుగుతున్నాయి. మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం కారణంగా ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించడంలో వెనుకడుగు వేస్తుంటాయి. కానీ ఆర్థిక లాభం కన్నా ప్రజల ఆరోగ్యం, సామాజిక శాంతి ముఖ్యమైనవి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంబంధించి నెలకు రూ.700 కోట్లు సరిపోవడం లేదు, రూ.1,500 కోట్లు చెల్లించాలి ఇచ్చిన హామీ మేరకు డీఏను విడుదల చేయాలి. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)నుంచి ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు మినహాయింపునిచ్చేందుకు పార్లమెంటులో చట్టసవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. జూన్ 13న విడుదల చేసిన డీఏ ఉత్తర్వులను అమలు చేయలి. ఆరోగ్య కార్డులు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని తక్షణమే ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ ఉత్తీర్ణత కావాలన్న నిబంధన నుంచి మినహాయించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### పూర్వ వైభవం రావాలి

ఒకనాడు తెలుగునాట పాడి పంటలు వెల్లివిరిసేయి. గ్రామాలలో నిత్యం పాలు,నెయ్యి, తేనెలు పుష్కలంగా లభించేవి. నదులలో నీరు నిండుగా ప్రవహించేవి. ఎప్పుడూ సిరిసంపదలతో విలసిల్లుతూ లలితకళలు నాట్యమాడేవి. శాతవాహన, ఇక్ష్వాక, కాకతీయ, విజయనగర సామ్రాజాల కాలంలో తెలుగుతేజం వెలుగొంది అనంత కీర్తిని ఆర్జించింది. ఆనాటి సిరిసంపదలను తిరిగి తెలుగు రాష్ట్రాలు సాధించాలి. ప్రజా జీవితాన్ని సౌభాగ్యవంతం చేయాలి. అప్పటి తెలుగ భాషను, కళా ప్రాభవాన్ని పునఃప్రతిష్టించాలి.ఆ లక్ష్యసాధన కోసం రెండుతెలుగు రాష్ట్రాలు సహకరించుకుంటూ ముందుకు సాగితే పూర్వ వైభవం తథ్యం.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### 12వ పీఆర్సీ కమిషన్ ప్రకటించాలి

కేంద్ర ప్రభుత్వం ఒకటి జనవరి 2026వ సంవత్సరము నుంచి అమలు కాబోయే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మరియు పెన్షనర్ల 8వ పే రివిజన్ కమిషన్‌కు చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జినినియమించడం జరిగింది.కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకటి జూలై 2023 నుండి అమలు కావలసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల 12వ పే రివిజన్ కమిషన్‌కు చైర్మన్‌ను ఇప్పటివరకు నియమించలేదు. కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, 12వ పీఆర్సీ అమలు చేసి రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు తగు న్యాయం చేయాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విత్తన బిల్లు ఎవరి కోసం?

*విత్తనాల పైన ధరల విషయంలో రాష్ట్రప్రభుత్వ నియంత్రణఉండాలి. విత్తనాల ఉత్పత్తి పైన ఆయా రాష్ట్ర ప్రభుత్వాలనియంత్రణ, పర్యవేక్షణ కూడా ఉండాలి. విత్తనాల పైన కృత్రిమ కొరత సృష్టిస్తే భవిష్యత్తులో ఆ కంపెనీకి అనుమతులు ఇవ్వకూడదు. దేశీయ లేదా సంప్రదాయ విత్తనాలను కాపాడుకొని భద్రపరిచే విధానం చట్టంలో ఉండాలి. రైతులు పాత పద్ధతులలో విత్తనాలు కాపాడుకునే పద్ధతిని ప్రోత్సహించాలి. 60 శాతం పైగా ఆధారపడ్డ వ్యవసాయ రంగానికి ప్రధా నమైన విత్తన చట్టాన్ని సవరణ చేస్తున్నారు. ఇంత పెద్ద చట్ట సవరణకు తూతూ మంత్రంగా కొన్ని రోజులు కాకుండా ఒక సంవత్సరం దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన ఒక పెద్ద చర్చ పెట్టి, మట్టి మనుషులైనా రైతుల నుండి రైతు సంఘాలు, మేధావుల నుండి అభిప్రాయాలు తీసుకొని చట్ట సవరణ చేయాలి.*

పదివేల సంవత్సరాల క్రితం భారతదేశంలో వ్యవసాయం ప్రారంభమైందని చరిత్ర చెబుతుంది. గతంలో ఎన్నడూ కూడా మన వ్యవసాయం విత్తనాలు ఉత్పత్తి చేసిందే కానీ విత్తనాలు కొనుగోలు చేయలేదు. కానీ హరిత విప్లవం తర్వాత హైబ్రిడ్ విత్తనాల పేర్లతో విత్తనాల అమ్మకం, దిగుమతి పెరిగింది. గత 20, 25 సంవత్సరాల క్రితం ప్రతి రైతు ఇల్లు ఒక 'విత్తన భాండాగారమే'! అప్పుడు రైతులు పండించిన పంటలో కొంత మంచి భాగాన్ని విత్తనాలుగా నిలువ చేసుకొని అదే విత్తనాలను మళ్లీ పెట్టుకుని పెట్టుబడులేని వ్యవసాయం చేసేవారు. కానీ 20, 25 సంవత్సరాల నుండి ప్రభుత్వం,కార్పొరేట్ విత్తన కంపెనీలు క్రమంగా రైతుల దగ్గర నుండి విత్తనాలను దూరం చేసి ఇప్పుడు ఏ చిన్న పంట పెట్టుకోవాలన్న విత్తనాల కంపెనీలపైన ఆధారపడి భారతదేశ వ్యవసాయ రంగం నడుస్తుందని అనడంలో అతిశయోక్తి లేదు. రైతులకు విత్తనాలు భారం కావడంతో పెట్టుబడులు పెరిగి రైతుల ఆత్మహత్యలకు విత్తనాల కొనుగోలు కూడా ఒక ప్రధాన కారణం అయింది. దేశవ్యాప్తంగా 540 విత్తన కంపెనీలు ఉన్నాయి. అవి సంవత్సరానికి దాదాపు 65 నుండి 70 వేల కోట్ల రూపాయల విత్తన వ్యాపారం చేస్తున్నాయని ఒక అంచనా! వ్యవసాయానికి భూమి ఎంత ముఖ్యమైనదో విత్తనం కూడా అంతే ముఖ్యమైనది. ఇది గమనించిన విత్తన కంపెనీలు ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయల నకిలీ విత్తనాలు అమ్ముతున్నాయని ఒక అంచనా! ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఒక దగ్గర నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులను చూస్తూనే ఉన్నాం. తాజాగా మెదక్ జిల్లా, చేగుంట మండలం, రుక్మాపూర్ గ్రామంలో ఒక విత్తన కంపెనీ వరి నకిలీ విత్తనాలతో సుమారు 45 మంది రైతులు 100 ఎకరాలలో వరి పంట వేస్తే ఒక ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఆనకిలీ విత్తనాలతో ఒక ఎకరాకు 6, 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రావడంతో ఆ రైతులు ఆత్మహత్యలే శరణ్యమని లబోదిబోమంటున్నారు. ఈ నకిలీ విత్తనాలతో పంట దిగుబడి రాలేదని ఎవరికి ఫిర్యాదు చేయాలో ఎవరికి మొరపెట్టుకోవాలో కూడా సరైన వ్యవస్థ లేక రైతులు నష్టపోతున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ విత్తన బిల్లు 2025 డిసెంబర్ 11 వరకు రైతులు, రైతు సంఘాలు సూచనలు చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో పెట్టింది. ఈ బిల్లు సాగుదారుల కోసమా? కార్పొరేట్ల కోసమా? అని రైతులు, రైతు సంఘాలు అంటున్నాయి. ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికడుతుందని చెబుతోంది, కానీ విమర్శకులు కార్పొరేట్ పక్షపాతం,జన్యు వైవిధ్యానికి ముప్పు, దేశ విత్తనాల ప్రస్తావనలేదని హెచ్చరిస్తున్నారు. 16 నవంబర్ 2025, విత్తన రంగాన్ని నియంత్రించే నిబంధనలను సమూలంగా మార్చడానికి భారత ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తనాల బిల్లు, 2025, 1966 విత్తనాల చట్టం, 1983 విత్తన నియంత్రణ ఉత్తర్వులను

పులి రాజు




భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త చట్టం నాణ్యమైన విత్తనాల సరఫరాను మెరుగుపరుస్తుందని, నకిలీలను అరికట్టగలదని, రైతులకు ఎక్కువ రక్షణ కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు. కానీ,2004, 2019లో మునుపటి ప్రయత్నాల మాదిరిగానే, ఈ బిల్లు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటుంది. రైతు సంఘాలు,విత్తన నిపుణులు, పౌర సమాజ సంస్థలు ప్రతిపాదిత చట్టం సాధారణ సాగుదారుల కంటే, ముఖ్యంగా సాంప్రదాయ, రసాయన రహిత వ్యవసాయంపై ఆధారపడే వారికంటే విత్తన కంపెనీలు వ్యవసాయ వ్యాపారాలకు బాగా సరిపోతుందని అంటున్నారు. రైతు విత్తనాలు కొన్నప్పుడు విత్తనాలు అమ్మే కంపెనీ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలి.జిల్లాలో ఏ డీలర్ కు ఎంత సీడ్ ఇచ్చారో కంపెనీ జిల్లా వ్యవసాయ అధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి.జిల్లా వ్యవసాయ అధికారికి కంపెనీ వారు సీడ్ ఎక్కడ ఉత్పత్తి చేసింది? ఏ రైతు వద్ద ఉత్పత్తి చేసింది?తనిఖీ చేసి రిపోర్ట్ ఇచ్చిన అధికారి, కంపెనీ వివరాలు మ్యానుఫ్యాక్చరింగ్ చేసిన యూనిట్ వివరాలు అన్నీ కూడా ఇవ్వాలి. సర్టిఫై చేసిన ఇన్స్పెక్టర్ ఇచ్చిన వివరాలు కూడా ఇవ్వాలి. కంపెనీ వేరే రాష్ట్రంలో నమోదు అక్కడ కార్యకలాపాలు చేస్తుంటే కంపెనీ ఆఫీస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో వేరే రాష్ట్రాలలో ఉన్నప్పుడు ఆ కంపెనీ సీడ్ అమ్ముతున్న రాష్ట్రంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. డీలర్ ఏ రైతుకు ఎన్ని విత్తనాలు అమ్మినది, రైతుకు బిల్లు ఇవ్వాలి. బిల్లులో డీలర్ సంతకం, లేదావేలిముద్ర వేయాలి. డీలర్ ఏ రైతుకు ఎన్ని విత్తనాలు అమ్మినది జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలి. రైతు తన పొలంలో పండిన పంటను విత్తనం కొరకు వాడిన ఇతర రైతులకు విత్తనం కొరకు అమ్ముకున్న జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలి. విత్తనం కొన్న రైతులు కూడా ఏ రైతు వద్ద నుండి కొన్నది ఆ రైతు వివరాలు జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలి. జిల్లా వ్యవసాయ అధికారి ఉద్యానవనాధికారి ఆధ్వర్యంలో జిల్లాకు ఇద్దరు సీడ్ వెరిఫికేషన్ అధికారులను ప్రభుత్వం నియమించాలి. నకిలీ విత్తనాలు ఉత్పత్తి చేసి సరఫరా చేసిన వ్యక్తులకు లేదా కంపెనీలకు కఠినమైన శిక్షలను తక్షణమే అమలు చేయాలి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం పొందడానికి సులభమైన మార్గం ఉండాలి. స్థానిక మండల వ్యవసాయ అధికారి రిపోర్టు ఆధారంగా నష్టపోయిన రైతుకు నష్టపరిహారం ఒక నెలలోపు అందించే విధంగా చట్టం ఉండాలి. విత్తనాల పైన ధరల విషయంలో రాష్ట్రప్రభుత్వ నియంత్రణఉండాలి. విత్తనాల ఉత్పత్తి పైన ఆయా రాష్ట్ర ప్రభుత్వాలనియంత్రణ, పర్యవేక్షణ కూడా ఉండాలి. విత్తనాల పైన కృత్రిమ కొరత సృష్టిస్తే భవిష్యత్తులో ఆ కంపెనీకి అనుమతులు ఇవ్వకూడదు. దేశీయ లేదా సంప్రదాయ విత్తనాలను కాపాడుకొని భద్రపరిచే విధానం చట్టంలో ఉండాలి. రైతులు పాత పద్ధతులలో విత్తనాలు కాపాడుకునే పద్ధతిని ప్రోత్సహించాలి. 60 శాతం పైగా ఆధారపడ్డ వ్యవసాయ రంగానికి ప్రధానమైన విత్తన చట్టాన్ని సవరణ చేస్తున్నారు. ఇంత పెద్ద చట్ట సవరణకు తూతూ మంత్రంగా కొన్ని రోజులు కాకుండా ఒక సంవత్సరం దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన ఒక పెద్ద చర్చ పెట్టి, మట్టి మనుషులైనా రైతుల నుండి రైతు సంఘాలు, మేధావుల నుండి అభిప్రాయాలు తీసుకొని చట్ట సవరణ చేయాలి. ●

# నితీష్ ముందు ఎన్నో సవాళ్లు!

సయ్యద్ నిసార్ అహ్మద్

దేశంలో మరెవ్వరూ చేపట్టిన విధంగా సుదీర్ఘకాలం సీఎంగా పేరుగాంచిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాజకీయ భవిష్యత్తు మున్ముందు ఎలా ఉండబోతోంది అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చసాగుతోంది. సీఎంగా నితీష్ మరోసారి బాధ్యతలు చేపట్టాక ఆయన రాజకీయ భవిష్యత్తుకు వచ్చిన ప్రమాదమేమిటీ అన్నది సందేహం వ్యక్తం కావచ్చు. కానీ ఈ సందేహానికి తాజా పరిణామాలు ఊతమిస్తున్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండు ఊత కర్రల సాయంతో నడుస్తోంది అన్నది అందరికీ తెలిసిందే ఒకటి ఏపీలోని టీడీపీకి ఉన్న 16 మంది ఎంపీల మద్దతుతో, రెండవది బీహార్‌లో నితీష్ కుమార్ నాయకత్వంలోని జేడీయూకి ఉన్న 12 మంది ఎంపీల బలంతో. ఇక బీహార్‌లో సీఎం పీఠం విషయంలో కనుక బీజేపీ ఏమైనా రాజకీయ ప్రయోగాలు చేస్తే ఆ ప్రభావం కచ్చితంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మీద పడుతుంది. వ్యూహాలలో నితీష్‌ని సైతం ఎవరూ తక్కువ అంచనా వేయడానికి అయితే లేదు. ఆయన తిమ్మిని సైతం బమ్మిగా చేయగలరు. ఈ నేపథ్యంలో నితీష్ కుమార్ విషయంలో బీజేపీ ఆచీతూచీ అడుగులు వేసింది. తనకుమెజార్టీ సీట్లు వచ్చినా మళ్లీ సీఎం పీఠం నితీష్ కుమార్‌కే బీజేపీ అప్పగించింది. సీఎం పీఠం అప్పగించినట్లు అప్పగించి పక్కల్లో బెల్లంలా తయారయ్యే వ్యూహాన్ని బీజేపీ అమలు చేసేందుకు సిద్ధమైంది. తాజాగా బీహార్ వరుసగా పదోసారి ముఖ్యమంత్రిగా నితీష్ ప్రమాణం చేశారు. ఆయనతో పాటు 25 మంది క్యాబినెట్ మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేయగా తాజాగా వారికి శాఖలను కేటాయించారు. ఈ ఎన్నికల్లో జేడీయూ 85 సీట్లు గెలిచి బీజేపీ (89) కంటే కేవలం నాలుగు సీట్లే వెనకబడింది. నితీష్ ముఖ్యమంత్రి కుర్చీపై తన పట్టును నిలుపుకున్నారు, కానీ ఆనందం ఆయనకు పూర్తిగా దక్కలేదు. దాదాపు రెండు దశాబ్దాల పాటు తనవద్దే ఉన్న హోంశాఖను బీజేపీ నేత, డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరికి అప్పగించారు. మరో డిప్యూటీ సీఎం విజయ్ సిన్హాకు రెవెన్యు, భూగర్భ శాఖలను కేటాయించారు. వీటితోపాటు కీలక మంత్రిత్వశాఖలను బీజేపీ తన వశం చేసుకొంది. అయితే, నితీష్ కుమార్ దాదాపు 20 ఏళ్లు తన వద్ద అట్టిపెట్టుకున్న హోం శాఖను తొలిసారి ఇతరులకు అప్పగించారు. దేశంలోని ఏ రాష్ట్ర లేదాసమాఖ్య వ్యవస్థలో అత్యంత విలువైన బీహార్ హోం శాఖను మొదటిసారిగా 2005 నవంబర్‌లో నితీష్ కుమార్ చేపట్టారు. అప్పటి నుంచి దాదాపుగా దానిని నిర్వహిస్తున్నారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో జేడీయూ పేలవ ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ సీఎం పదవికి నితీష్ రాజీనామా చేసి. హిందూస్థాన్ అవామ్ మోర్చాకు చెందిన జితన్ రామ్ మాంఝీకి 2014 మేలో బాధ్యతలు అప్పగించారు. ఆయన 2015 ఫిబ్రవరి వరకూ 9 నెలల పాటు కొనసాగిన సమయంలో తప్ప హోంశాఖ నితీష్ వద్దే ఉంది. అందువల్ల, హోం శాఖను బీజేపీకి అప్పగించడం చెప్పుకోదగ్గ అంశం. అంతేకాదు, కాషాయ పార్టీని పెద్దన్న అని అంగీకరించినట్టయ్యింది. 2020 ఎన్నికల్లో బీజేపీ, జేడీయూలు కలిసి పోటీ చేశాయి. ఆ సందర్భంలో బీజేపీ 74 సీట్లు గెలుచుకుని, ప్రతిపక్ష రాష్ట్రీయ జనతాదళ్ తర్వాతి స్థానంలో నిలిచింది. జేడీయూ కేవలం 45స్థానాలకే పరిమితమైంది.దీంతో సీఎం పదవి కోసం బీజేపీ పట్టుబడుతుందని భావించారు. కానీ, నితీష్ సీఎంగానే కొనసాగి, హోంశాఖను తన వద్దే అట్టిపెట్టుకున్నారు. కానీ ఇప్పుడు హోంశాఖ నితీష్ కుమార్ నుంచి చేజారింది. కీలకమైన హోంశాఖ బీజేపీ చేతుల్లోకి వెళ్లిందంటే రాష్ట్ర పాలన రిమోట్ ఓ రకంగా బీజేపీ చేతుల్లోకి వెళ్లినట్లే. నితీష్ కుమార్ ఏ మాత్రం తోక జాడించినా వాత పెట్టేలా ప్లాన్ మాత్రం మొదలైంది. ఈ పరిణామాల నేపథ్యంలో నితీష్ కుమార్ మాత్రం మునుపటి మాదిరిగా పూర్తి స్వేచ్ఛగా ఏ మేరకు పనిచేయగలరు అన్నదే ప్రశ్న. బీజేపీ అత్యంత బలంగా ఉంది. మిత్రులు కూడా ఆ పార్టీతోనే ఉంటారు. నితీష్ కుమార్ పేరుకు సీఎంగా ఉన్న ప్రధాన నిర్ణయాలు అన్నీ బీజేపీ ద్వారానే జరిగిపోయే అవకాశముంది. ఇక నితీష్ కుమార్ సీఎం పదవి కూడా దినదిన గండంగా ఉండబోయే పరిస్థితి. నితీష్ కుమార్‌ని బీజేపీ వద్దు అనుకున్నపుడు ఏమైనా చేసే సీన్ అయితే బీహార్‌లో ఉంది. పైగా గతంలో అనేక రాష్ట్రాలలో బీజేపీ ఎత్తులు వ్యూహాలు అందరూ చూసినవే. దాంతో నితీష్ చాలా జాగ్రత్తగానే బీజేపీతో వ్యవహరించాల్సి ఉంది. ఇక పోతే ఎంతగా తగ్గి వ్యవహరించినా నితీష్ కుమార్ ముఖ్యమంత్రిత్వం గరిష్టంగా మూడేళ్ళ ముచ్చటగానే ముగిసే అవకాశం లేకపోలేదు. 2029 ఎన్నికలలో కనుక బీజేపీ పూర్తి మెజారిటీని సాధించి కేంద్రంలో మరోమారు అధికారంలోకి వస్తే అప్పుడు బీహార్‌లో బీజేపీ సీఎం కచ్చితంగా మార్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే బీహార్‌లో ఎన్నికలు తిరిగి 2030 నవంబర్‌లోనే జరుగుతాయి. బీజేపీ సీఎం అక్కడ నుంచి మరో సంవత్సరంన్నర పాటు పాలించే వెసులుబాటు ఉంటుంది. ఈ లోపు జేడీయూ నుంచి ఎమ్మెల్యేలను లాగేసి, ఆ పార్టీ ఎంపీలను లాగేసి సీఎం పీఠం నుంచి నితీష్‌ను బీజేపీ దించే ప్రయత్నం చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ●

# సానుభూతి కాదు..సహకారమే ఊపిరి!

డి జె మోహన రావు

సమాజంలో ప్రతి మనిషికి గౌరవంగా బ్రతికే హక్కు ఉంది. శారీరకంగా లేదా మానసికంగా కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, అద్భుతమైన ప్రతిభను కనబరిచే వారే 'దివ్యాంగులు'. గతంలో వీరిని వికలాంగులు అని పిలిచేవారు. కానీ వారిలోని లోపాన్ని కాకుండా, వారిలోని ప్రత్యేక సామర్థ్యాన్ని గుర్తించాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం వారిని 'దివ్యాంగులు'గా సంబోధిస్తోంది. దివ్యాంగులు అంటే జన్మతః లేదా ప్రమాదం వల్ల శారీరక, మానసిక, మేధో లేదా ఇంద్రియ లోపాలు కలిగి, ఇతరులతో సమానంగా సమాజంలో పాలుపంచుకోవడానికి అవరోధాలను ఎదుర్కొనే వ్యక్తులు. వైకల్యం అనేది వారి వ్యక్తిత్వంలో ఒక భాగం మాత్రమే తప్ప, అది వారి పూర్తి అస్తిత్వం కాదని సమాజం గుర్తించాలి. 1995 నాటి చట్టం కేవలం ఏడు రకాల వైకల్యాలను మాత్రమే గుర్తించగా, 2016లో వచ్చిన నూతన చట్టం ప్రకారం యాసిడ్ దాడి బాధితులు, పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్తులతో కలిపి మొత్తం 21 రకాల వైకల్యాలను ప్రభుత్వం గుర్తించింది. మన దేశ జనాభా ముఖచిత్రాన్ని పరిశీలిస్తే 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 2.68 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారు. ఇది మొత్తం జనాభాలో సుమారు 2.21 శాతం. అయితే, ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం ఏ దేశంలోనైనా జనాభాలో 10 నుండి 15 శాతం మంది ఏదో ఒక రూపంలో వైకల్యాన్ని కలిగి ఉంటారు. ఈ అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చితే మన ప్రభుత్వ లెక్కలు తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం, వైకల్యాన్ని గుర్తించే ప్రక్రియలో లోపాలు, సామాజిక భయంతో కుటుంబాలు వివరాలను బయటకు చెప్పకపోవడమే. ఇక జనాభా నిష్పత్తిని గమనిస్తే, మొత్తం దివ్యాంగులలో పురుషులు 56 శాతం ఉండగా, స్త్రీలు 44 శాతంగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధిక శాతం దివ్యాంగులు నివసిస్తున్నారు. సమాజంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు భౌతికమైనది కాదు. మానసికమైనది. వీరు ఏ పనీ చేయలేరు అనే చిన్నచూపు, లేదా అయ్యో పాపం అనే సానుభూతి రెండూ వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. విద్య, ఉద్యోగ రంగాల్లోనే కాకుండా, సామాజిక సంబంధాల్లోనూ, వివాహ వ్యవస్థలోనూ వారు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారు. సినిమా హాళ్లు, పార్కులు, షాపింగ్ మాల్స్, చివరకు దేవాలయాలు కూడా దివ్యాంగులకు అనుకూలంగా లేకపోవడంతో వారు సమాజంలో కలవలేకపోతున్నారు. ఇది వారిని ఒంటరితనం వైపు నెట్టివేస్తోంది. ఒకవేళ ఎవరైనా కష్టపడి పైకి వచ్చినా, వారిప్రతిభను కాకుండా వైకల్యాన్ని హైలైట్ చేయడం మరో రకమైన వివక్ష. సామాజిక అభివృద్ధికి ప్రధాన సూచిక అయిన అక్షరాస్యతలో దివ్యాంగులు వెనుకబడి ఉన్నారు. జాతీయ సగటుతో పోలిస్తే వీరి అక్షరాస్యత రేటు కేవలం 55 శాతంగా మాత్రమే ఉంది. ఇందులోనూ స్త్రీల అక్షరాస్యత 45శాతంగా ఉండటం ఆందోళనకరం. విద్యాసంస్థల్లో మౌలిక వసతులు లేకపోవడం, ప్రత్యేక బోధనా



పద్ధతుల కొరత వీరి విద్యాభ్యాసానికి ఆటంకాలుగా మారుతున్నాయి. ఉద్యోగ రంగంలో కూడా పరిస్థితి భిన్నంగా లేదు. సుమారు 64 శాతం మంది దివ్యాంగులు నిరుద్యోగులుగా లేదా ఎటువంటి ఉత్పాదక పనుల్లో పాల్గొనలేని వారిగా మిగిలిపోతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ, ఉన్నత స్థాయి ఉద్యోగాల కంటే క్లర్క్ లేదా గ్రూప్‌డి స్థాయిలోనే వీరి ప్రాతినిధ్యం కనిపిస్తోంది. అనేక బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోవడం వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. భారత రాజ్యాంగం దివ్యాంగులకు ప్రత్యేక రక్షణ కల్పిస్తోంది. అధికరణ 14 సమానత్వాన్ని, అధికరణ 15 వివక్ష రహిత సమాజాన్ని కాంక్షిస్తుండగా, అధికరణ 41 ప్రకారం వైకల్యం ఉన్నవారికి పనిహక్కు, విద్యాహక్కు కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించింది. ఈ స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మకమైన 'దివ్యాంగుల హక్కుల చట్టం2016'ను తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లను 3శాతం నుండి 4శాతానికి పెంచడమే కాకుండా,ఉన్నత విద్యాసంస్థల్లో 5 శాతం సీట్లను కేటాయించింది. ఎవరైనా దివ్యాంగులను అవమానిస్తే లేదా వారి పట్ల వివక్ష చూపితే కఠిన శిక్షలు విధించే వెసులుబాటును కూడా ఈచట్టం కల్పించింది. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. వీటిలో 'సుగమ్య భారత్ అభియాన్' ముఖ్యమైనది. ఇది ప్రభుత్వ భవనాలు, రవాణా వ్యవస్థ, సమాచార సాంకేతికతలలో భౌతిక అడ్డంకులను తొలగించి, దివ్యాంగులకు సులభతర వాతావరణాన్ని కల్పిస్తుంది. విద్య కోసం ఉపకార వేతనాలు, ఉద్యోగుల కోసం రిజర్వేషన్లు, యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డ్ ద్వారా ప్రభుత్వ పథకాలను సులభంగా పొందే సౌలభ్యం, వివిధ సహాయ ఉపకరణాల పంపిణీ వంటివి ఈ సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఎక్కడైనా సంక్షేమ ఫలాలను పొందేందుకు వీలుగా ఈ కార్డులను జారీని వేగవంతం చేశారు. ఇవే కాకుండా నేషనల్ ఫెలోషిప్స్ ద్వారా ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక సహాయం కూడా అందుతోంది. ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ, సామాజిక దృక్పథంలో మార్పు రానంత వరకు దివ్యాంగుల కష్టాలు తీరవు. మన సమాజంలో సాధారణ మహిళలే అనేక వివక్షలు ఎదుర్కొంటుంటే, దివ్యాంగ మహిళలు అటు స్త్రీగానూ, ఇటు దివ్యాంగురాలిగానూ 'ద్వంద్వ వివక్ష' అనుభవిస్తున్నారు. ఈ వివక్షను అధిగమించడానికి పరిష్కారం కేవలం చట్టాల అమలులోనే కాకుండా, సమాజ దృక్పథంలో మార్పు రావడంలో ఉంది. వైకల్యాన్నిశాపంగా భావించే మూఢనమ్మకాలు, కొన్ని కార్యాలయాల్లో ర్యాంపులు లేకపోవడంవంటి నిర్మాణాత్మక లోపాలు వారి ప్రగతిని అడ్డుకుంటున్నాయి.ఈ సమస్యలను అధిగమించాలంటే 'చేతకాదు' అనే భావన నుండి 'చేయగలరు' అనే నమ్మకాన్ని వారిలో కలిగించాలి. దివ్యాంగులను జాలి చూపాల్సిన వ్యక్తులుగా కాకుండా, ప్రత్యేక సామర్థ్యం కలిగిన పౌరులుగా సమాజం గుర్తించాలి. ప్రైవేట్ సంస్థలలోను రిజర్వేషన్లను మరింత కఠినంగా అమలు చేసే విధంగా ప్రభుత్వాలు ఆదేశాలు జారీచేయాలి. అన్ని ప్రభుత్వ,ప్రైవేటు సంస్థలలో దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం,సాంకేతికత అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో వైకల్యంపై అవగాహన పెంచడం, వారిని ప్రధాన స్రవంతిలో భాగం చేయడమే భవిష్యత్తుకు నిజమైన పరిష్కారం అవుతుంది. వైకల్యం అనేది శరీరానికి సంబంధించినదే తప్ప, మనసుకు లేదా ప్రతిభకు కాదనే సత్యాన్ని ప్రతి పౌరుడు గ్రహించాలి. ●

# పార్టీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్

## సిఎం సిద్దరామయ్యతో భేటీ అనంతరం డికె

### ఇద్దరూ కలిసి రెండోసారి టిఫిన్ భేటీ

### కర్ణాటక రాజకీయాలు మరోమలుపు



**బెంగళూరు, డిసెంబరు 2:** కర్ణాటక రాజకీయాల్లో నెలకొన్న నాయకత్వ పోరు ఊహాగానాల మధ్య ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య మరో భేటీ జరిగింది. మంగళవారం ఉదయం బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్దరామయ్య అల్పాహార విందుకు హాజరయ్యారు. శివకుమార్, ఆయన సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ సిద్దరామయ్యకు సాదరంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. వారంలో వీరిద్దరూ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొనడం ఇది రెండోసారి. పార్టీలో ఐక్యతను చాటిచెప్పేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 8 నుంచి బెళగావిలో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సీఎం పర్యటన సందర్భంగా శివకుమార్ ఇంటి పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. సిద్దరామయ్యకు అత్యంత ఇష్టమైన నాటు కోడి వంటకాలను ఈ విందులో ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు శివకుమార్ ముందే వెల్లడించారు. కర్ణాటక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు మేమిద్దరం కలిసికట్టుగా కృషి చేస్తామని ఆయన ట్వీట్ చేశారు. సీఎం పదవి కోసం ఇద్దరు నేతల మధ్య పోటీ ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని ఇరువురు నేతలు ఇదివరకే స్పష్టం చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా డీకే శివకుమార్ చేసిన ట్వీట్ రాజకీయంగా చర్చనీయాంశమైంది. కష్టాలను తొలగించే మారుతి రాయుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కర్ణాటక రాజకీయాల్లో బ్రేక్‌ఫాస్ట్ డిప్లమస్ ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య విభేదాలు న్నాయనే ప్రచారానికి తెరదించేలా, వారం వ్యవధిలోనే వీరిద్దరూ రెండోసారి సమావేశం అయ్యారు. కర్ణాటక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మా ఉమ్మడి ప్రయత్నాలను మరింత బలోపేతం చేసేందుకు, తామిద్దరం ఒకే బృందంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిద్ధరామయ్యకు అత్యంత ఇష్టమైన నాటుకోడి వంటకాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నట్లు కూడా ఆయన వెల్లడించారు. గతనెల 30న సీఎం నివాసంలో జరిగిన తొలి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ తర్వాత కూడా డీకే శివ కుమార్ మాట్లాడుతూ తామిద్దరం కలిసే ఉన్నామని, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటామని స్పష్టం చేశారు. మీడియాలో వస్తున్న ఊహాగానాల ఒత్తిడి కారణంగానే తాము ఇలా సమావేశం కావాల్సి వస్తోందని, తమ మధ్య ఎలాంటి విభేధాలు లేవని ఆయన పునరుద్ఘాటించారు. ఈ వరుస సమావేశాలు కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి మద్దతుతో జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## జననాల రేటు పెంపునకు చర్యలు

## చైనాలో కండోమ్స్‌పై పన్ను!



**బీజింగ్, డిసెంబరు 2:** జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న చైనా జననాల రేటును పెంచేందుకు అనేక చర్యలు చేపడుతోంది. పిల్లల కనడాన్ని ప్రోత్సహిస్తూ ఇప్పటికే అనేక పథకాలను అమలు చేస్తోంది. తాజాగా కండోమ్ సహా గర్భనిరోధక సాధనాలు, ఔషధాలపై పన్ను బాదుడుకు సిద్ధమైంది. జనాభా పెంపునకు సంబంధించి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం గత మూడు దశాబ్దాల్లో ఇదే తొలిసారి కావడం గమనార్హం. **పన్ను పునరుద్ధరణ:** కొత్తగా సవరించిన విలువ ఆధారిత పన్ను (విఎటి) చట్టం ప్రకారం.. గర్భనిరోధక సాధనాలు సహా పలు వస్తువులపై 13 శాతం పన్ను విధించనున్నారు. కుటుంబ నియంత్రణ కఠినంగా అమలు చేసిన 1993 నుంచి వీటిపై పన్ను మినహాయింపు కొనసాగుతోంది. తాజాగా దీనిని ఎత్తివేసేందుకు చైనా సిద్ధమైంది. వీటితోపాటు పిల్లల సంరక్షణ సేవలు (నర్సరీ నుంచి కిండర్‌గార్టెన్స్ వరకు), వృద్ధుల సంరక్షణ, దివ్యాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలపై పన్ను మినహాయింపు ఇవ్వనుంది. తద్వారా కాబోయే తల్లిదండ్రులకు పన్ను ఊరట కలిగించాలని చైనా ప్రభుత్వం ఉద్దేశంగా తెలుస్తోంది. వచ్చే జనవరి నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నట్లు సమాచారం. వీటితోపాటు పిల్లల సంరక్షణకు నగదు ప్రోత్సాహకాలు అందించడం, పితృత్వ, ప్రసూతి సెలవులను పెంచడం, గర్భస్రావాలను తగ్గించడం వంటి చర్యలనూ చేపడుతోంది. వీటికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిసింది.

**పిల్లల పెంపకం ఆర్థిక భారంగా:** పిల్లల పెంపకం అత్యంత ఖరీదైన దేశాల్లో చైనా ఒకటి. 18 యేళ్ల వరకు పెంచేందుకు సరాసరి 76 వేల డాలర్లు (రూ. 68 లక్షలు) ఖర్చు అవుతున్నట్లు అంచనా. దీంతో అనేకమంది చైనా దంపతులు పిల్లల్ని కనేందుకు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది. యువతలో ఈ వైఖరిని తగ్గించేందుకు చైనా ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. **హెచ్ఐవిపై ఆందోళన:** ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి కేసులు తగ్గుముఖం పడుతున్న వేళ.. పలు దేశాల్లో వీటి సంఖ్య పెరుగుతున్నట్లు నివే దికలు వెల్లడిస్తున్నాయి. చైనా సిడిసి ప్రకారం గత ఇరవై యేళ్లతో పోలిస్తే ఇటీవల స్థానికంగా ఎయిడ్స్ కేసుల సంఖ్య పెరిగింది. ఇటువంటి తరుణంలో కండోమ్‌ల ధరలు పెంచడం ప్రతి కూల ఫలితాలకు దారితీస్తుందనే వాదన స్థానిక సోషల్ మీడియాలో మొదలైంది. దశాబ్దాల పాటు వన్‌చైల్డ్ పాలసీని అనుసరించిన చైనాలో వృద్ధ జనాభా వేగంగా పెరుగు తున్న విషయం తెలిసిందే. గతమూడేళ్లుగా జననాల రేటు గణనీయంగాతగ్గింది. దశాబ్దం క్రితం యేడాదిలో 1.88కోట్ల జననాలు నమోదు కాగా గతేడాది ఇదిసగానికి పడిపోయి 95.4 లక్షలుగా నమోదైంది. ఈ నేపథ్యంలో జననాల రేటును పెంచేందుకుచైనాఅనేక కార్యక్రమాలు చేపడుతోంది.

## బెంగాల్‌లో 43.30 లక్షల ఓటర్ల తొలగింపు


### మూడురోజుల సర్‌లో ఎన్నికల సంఘం నిర్ణయం

**కోల్‌కత్తా, డిసెంబరు 2:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా భారీ సంఖ్యలో పేర్లను తొలగించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సిద్ధమైంది. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) సేకరించిన ఫారాల డిజిటైజేషన్ సరళిని బట్టి, సుమారు 43.30 లక్షల పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి మినహాయించనున్నట్లు ఈసీఐ అంచనా వేసింది. ఈ ముసాయిదా జాబితాను ఈ నెల 16న ప్రచురించనున్నారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయ వర్గాల ప్రకారం సోమవారం సాయంత్రం వరకు జరిగిన డిజిటైజేషన్ ఆధారంగా ఈ అంచనా వేశారు. ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 27 నాటికి బెంగాల్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7,66,37,529గా ఉంది. తొలగించనున్న 43.30 లక్షల పేర్లలో అత్యధికంగా 21.45 లక్షల మంది మరణించిన ఓటర్లు ఉన్నారు. సుమారు 15.10 లక్షల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు కాగా, 5.5 లక్షల మంది ఆచూకీ లభించని వారుగా గుర్తించారు. బోగస్ లేదా నకిలీ ఓటర్ల సంఖ్య లక్ష కంటే తక్కువగా ఉన్నట్లు తేలింది. అయితే, రాష్ట్రంలోని 2,208 పోలింగ్ బూత్‌లలో మరణించిన, నకిలీ లేదా వలస వెళ్లిన ఓటరు ఒక్కరూ లేరని గుర్తించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇన్ని బూత్‌లలో ఒక్క లోపం కూడా లేకపోవడంపై బీజేపీ అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ బూత్‌ల నుంచి సేకరించిన ఫారాలను పునఃసమీక్షించాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి స్పందించారు. గతనెల 26, 27, 28 తేదీల్లో కేవలం మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో 1.25 కోట్ల ఫారాలు నమోదు కావడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆ మూడు రోజుల్లో నమోదైన ఫారాలపై ఆడిట్ నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. దీంతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ రాజకీయంగానూ వేడెక్కింది.

## సరిహద్దులవెంబడి ఇప్పటికీ ఉగ్రశిబిరాలున్నాయ్..

### బిఎస్ఎఫ్ ఐజి అశోక్ యాదవ్

**శ్రీనగర్, డిసెంబరు 2:** ఆపరేషన్ సిందూర్' లో పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం తుడిచిపెట్టి ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న ఈ క్యాంపులను భారత వైమానిక దళం ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులు ఈ దాడుల్లో హతమయ్యారు. అయితే, ఇప్పటికీ ఇంకా ఉగ్రస్థావరాలు మిగిలే ఉన్నాయని, అక్కడ ఉగ్ర కార్యకలాపాలు జరుగుతున్నాయని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఐజీ అశోక్ యాదవ్ వెల్లడించారు. నియంత్రణ రేఖకు ఆవలివైపు ప్రస్తుతం 69 ఉగ్రస్థావరాలు యాక్టివ్ గా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ క్యాంపుల్లో సుమారు 100 నుంచి 120 మంది ఉగ్రవాదులు భారత్ లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భారత్ లోకి చొరబడేందుకు అవకాశం కోసం చూస్తున్నారని వివరించారు. అయితే, ఉగ్ర వాదుల కదలికలను నిరంతరం గమనిస్తున్నామని ఆయన వివరించారు. ఇటీవల ఎనిమిది మంది ఉగ్రవాదులు సరిహద్దులు దాటి భారత్‌లోకి అడుగుపెట్టేందుకు విఫలయత్నం చేశారని అశోక్ యాదవ్ చెప్పారు. చొరబాటుకు నాలుగుసార్లు ప్రయత్నించిన ఆ ఎనిమిది మంది ఉగ్రవాదులను బీఎస్ఎఫ్ మట్టుబెట్టిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో బీఎస్ఎఫ్ కీలకంగా వ్యవహరించిందని, సరిహద్దుల్లోని పాక్ ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంలో పాలుపంచుకుందని బీఎస్ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్ తెలిపారు.



## మాజీ సిఎం యెడియూరప్పకు సుప్రీంలో ఊరట..



**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడ్యూరప్పకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఆయనపై దాఖలైన పోక్సో కేసు విచారణపై స్టే విధించింది. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను యడ్యూరప్ప సుప్రీంకోర్టుల్ సవాల్ చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంలో మళ్లీ కర్నాటక హైకోర్టు విచారించాలని ఆదేశించాలా? వద్దా? అన్న అంశానికి మాత్రమే నోటీసులు జారీ చేసినట్లు బెంచ్ స్పష్టం చేసింది. పోక్సో చట్టం కింద చార్జిషీట్‌ను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడాన్ని సమర్థిస్తూ విచారణకు హాజరు కావాలని ఆదేశించిన కర్నాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాల్ చేస్తూ యడ్యూరప్ప స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సీజేఐ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపింది. ఈ కేసులో ఏం జరగలేదని చూపించే కీలకమైన ఆధారాలను హైకోర్టు విస్మరించిందని యడ్యూరప్ప తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఆయన నాలుగు సార్లు సీఎంగా పని చేశారన్నారు. 2024 మార్చి 14న ఓ మహిళ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. సహాయం కోసం యడ్యూరప్ప ఇంటికి వెళ్లిన సమయంలో తన 17 సంవత్సరాల కుమార్తెను లైంగికంగా వేధించారని, డబ్బు ఇచ్చి ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారని సదరు మహిళ ఆరోపించింది. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జూలై 4, 2024న ట్రయల్ కోర్టు యడ్యూరప్పతో పాటు మరో ముగ్గురిపై కేసును అణగదొక్కేందుకు ప్రయత్నించారని, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారంటూ అభియోగాలను నమోదు చేసింది.

ఆ తర్వాత కర్నాటక హైకోర్టు కేసును పునఃపరిశీలించాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఫిబ్రవరి 18న ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు యడ్యూరప్పతో పాటు ముగ్గురిని మార్చి 15న తన ఎదుట కావాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, కోర్టు ఇచ్చిన ఆదేశాలతో పాటు ఫిర్యాదు సైతం కొట్టివేయాలని యడ్యూరప్ప హైకోర్టులో సవాల్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమేనని మాజీ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే, ఇటీవల కేసును కొట్టి వేసేందుకు హైకోర్టు నిరాకరించడంతో మాజీ సీఎం సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## రోహింగ్యాలకు రెడ్‌కార్పెట్‌తో స్వాగతం చెప్పాలా?

### పిటిషనర్ న్యాయవాదిపై చీఫ్‌జస్టిస్ ఫైర్



**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** రోహింగ్యాలను భారత ప్రభుత్వం శరణార్థులుగా ప్రకటించలేదని, తప్పిపోయిన ఐదుగురు రోహింగ్యాలను గుర్తించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫైర్ అయ్యారు. అక్రమవలసదారులకు దేశంలో రెడ్‌కార్పెట్‌వేసి స్వాగతించాలా అని పిటిషనర్ న్యాయవాదిని ప్రశ్నించారు. ఎవరైనా అక్రమంగా దేశంలోకి వస్తే వారిని దేశంలో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందా అని చీఫ్‌జస్టిస్ వ్యాఖ్యానించారు.

## ప్రియుడి రక్తంతోనే సిందూరం..

### మృతదేహానికి పూలమాల వేసి మెడలో తాళికట్టుకున్న యువతి

### నాందేడ్ హత్య పోలీసులే రెచ్చగొట్టి-చేయించారు..


### బాధితురాలు తీవ్రస్థాయిలో ధ్వజం

**నాందేడ్, డిసెంబరు 2:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన పరువు హత్యలో వితంతు వధువు తన ప్రియుడి రక్తాన్నే సింధూరంగా ధరించింది. ఈ హత్య వెనుక పోలీసుల ప్రమేయం కూడా ఉందంటూ బాధితురాలు అంచల్ చేసిన ఆరోపణలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. కన్నీరుమున్నీరవుతూ ఆమె చెప్పిన మాటలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఘటన జరిగిన రోజు ఉదయం, మా అన్న నన్ను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. సాక్షంపై తప్పుడు కేసు పెట్టాలని నాపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడు. నేను అందుకు నిరాకరించాను. అప్పుడు అక్కడున్న పోలీసులు, కేసులు ఎందుకు వాడిని లేపేసి రండి అని మా అన్నను రెచ్చగొట్టారు. దాన్నే సవాలుగా తీసుకుని, నా కళ్లెదుటే నా ప్రాణమైన సాక్షం(భర్త)ను చంపేశారు అంటూ ఆమె చేసిన ఆరోపణలు వ్యవస్థనే ప్రశ్నిస్తున్నాయి. సాక్షం అంత్యక్రియల సమయంలో అక్కడికి చేరుకున్న అంచల్, అతడి మృతదేహంపై పడి విలపించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. అనంతరం, ఎవరూ ఊహించని విధంగా, అతడి నిర్జీవ దేహానికి పూలమాల వేసి, తాళి కట్టింది. అతని దేహంపై ఉన్న రక్తపు మరకలను తన పాపిటలో సిందూరంగా దిద్దుకుని, ఈ రోజు నుంచి నేను సాక్షం భార్యను. జీవితాంతం అతడి కుటుంబంతోనే ఉంటాను. నా వాళ్లే నాకు ద్రోహం చేశారు, వారిని ఉరితీసే వరకు పోరాడతానని శపథం చేసింది. ఈ ఘటనపై హత్య, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు, అంచల్ కుటుంబసభ్యులు సహా ఎనిమిది మందిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, పోలీసులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు విచారణ ఏ మలుపు తీసుకుంటుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నాందేడ్‌కు చెందిన అంచల్ మామిల్వార్ (21), అదే ప్రాంతానికి చెందిన సాక్షం తాటే (20) అనే యువకుడు మూడేళ్లుగా గాఢంగా ప్రేమించుకుంటున్నారు. ఒక్కటై బతకాలని కలలు కన్నారు. అయితే, సాక్షం షెడ్యూల్డ్ కులానికి చెందినవాడు కావడమే వారి ప్రేమకు శాపంగా మారింది. అంచల్ కుటుంబం వారి వివాహానికి తీవ్రంగా అడ్డుచెప్పింది. తమ పరువుకు భంగం కలుగుతుందని భావించి, సాక్షంను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. అంచల్ తండ్రి, ఇద్దరు సోదరులు, మరికొందరు బంధువులు కలిసి సాక్షంపై అత్యంత పాశవికంగా దాడికి పాల్పడ్డారు. తుపాకితో కాల్చి, బండరాళ్లతో తలపై మోది కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు కేసునమోదుచేసారు.



## పుతిన్ పర్యటనకు అంతర్జాతీయ భద్రత

### తినే ఆహారమే కాదు టాయిలెట్ కూడా రష్యా నుంచే..



**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న ఏర్పాట్లు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆయన తాగే నీరు, తినే ఆహారం మాత్రమే కాదు ఉపయోగించే టాయిలెట్‌ను కూడా రష్యా నుంచే ప్రత్యేకంగా తీసుకురానుండటం ఆయన భద్రతా ప్రమాణాల తీవ్రతను తెలియజేస్తోంది. విదేశీ పర్యటనల్లో పుతిన్ భద్రతను ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ పర్యవేక్షిస్తుంది. అధ్యక్షుడి రాకకు నెల రోజుల ముందే ఒక బృందం ఆతిథ్య దేశానికి చేరుకొని, ఆయన బస చేసే హోటల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంది. ఆయన వాడే సబ్బులు, షాంపూల నుంచి టూత్‌పేస్ట్ వరకు అన్నీ రష్యా నుంచే తెచ్చి హోటల్ గదిలో అమర్చుతారు. భద్రతా కారణాల దృష్ట్యా పుతిన్ మొబైల్ ఫోన్ ఉపయోగించరు. అత్యంత సురక్షితమైన కమ్యూనికేషన్ లైన్ ద్వారానే సంభాషణలు జరుపుతారు. ఇందు కోసం ఆయన గదిలోనే ప్రత్యేక టెలిఫోన్ బూత్‌ను ఏర్పాటు చేస్తారు. పుతిన్ ప్రయాణించే ఇల్యూషిన్ ఐఎల్96300పీయూ విమానాన్ని 'ఎగిరే క్రెమ్లిన్' అని పిలుస్తారు. ఇందులో సమావేశ గదులు, జిమ్, మెడికల్ రూమ్‌తో పాటు అణుదాడికి ఆదేశాలు జారీ చేసే 'న్యూక్లియర్ కమాండ్ బటన్' కూడా ఉంటుంది. ఆయన విమానానికి యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా ఉంటాయి. సాంకేతిక సమస్యలు ఎదురైతే, ప్రత్యామ్నాయంగా మరో విమానాన్ని కూడా వెంట తీసుకువస్తారు. పర్యటనలో పుతిన్ ప్రయాణించే 'ఆరస్ సెనెట్' కారును కూడా రష్యా నుంచే తీసుకొస్తారు.

ఈ కారు బుల్లెట్లు, గ్రెనేడ్లు, రసాయన దాడులను సైతం తట్టుకోగ లదు. నాలుగు టైర్లు పంక్చర్ అయినా ఆగకుం డా ప్రయాణించగలదు. ఇక ఆహారం విషయాని కొస్తే, రష్యా నుంచి తెచ్చిన పదార్థాలను ప్రత్యేక చెఫ్‌లు వండుతారు. వండిన ఆహారాన్ని పుతిన్ తినే ముందు పరీక్షించడానికి ఒక మొబైల్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. బహిరంగ కార్యక్రమాల్లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించే పుతిన్ చుట్టూ ఎల్లప్పుడూ నాలుగంచెల భద్రతా వలయం ఉంటుంది.

## ప్రధాని మోడీ వల్లే ప్రపంచానికి తెలిసిన భారత్ సత్తా

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**పూణె, డిసెంబరు 2:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడినప్పుడు ప్రపంచ దేశాల నేతలు ఎంతో శ్రద్ధగా వింటున్నారని, దీనికి కారణం అంతర్జాతీయ వేదికపై భారత్ బలం, సత్తా ప్రదర్శితం కావడమేనని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. భారత్‌కు దక్కాల్సిన సరైన స్థానం ఇప్పుడు లభిస్తోందని, అందుకే ప్రపంచం మన దేశాన్ని గమనిస్తోందని ఆయన పేర్కొన్నారు. పూణెలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవత్ ప్రసంగించారు. భారత్ అభివృద్ధి పథంలో పయనిస్తే ప్రపంచ సమస్యలు పరిష్కారమవుతాయని, ఘర్షణలు తగ్గి శాంతి నెలకొంటుందని విశ్వాసం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు కూడా భారత్ నుంచి ఇదే ఆశిస్తున్నాయని ఆయన తెలిపారు. సంఘ్ స్థాపించి వందేళ్లు పూర్తయినప్పటికీ, సమాజాన్ని ఏకం చేసే పనిలో ఇంత జాప్యం ఎందుకు జరిగిందనే దానిపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని భగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, తొలితరం కార్యకర్తల త్యాగాల వల్లే సంఘ్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకుందని గుర్తుచేశారు. తాము ఆలస్యంగా రాలేదని, తమ మాట వినడం మీరే ఆలస్యం చేశారని ఒక సందర్భంలో తాను చెప్పినట్లు భగవత్ గుర్తు చేసుకున్నారు. వైవిధ్యంలో ఏకత్వమే మన పునాది. ధర్మం ఆధారంగా మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగాలి అని ఆయన పిలుపునిచ్చారు.

## సంక్షిప్తంగా..

### మరో పదేళ్లలో అణుయుద్ధం: ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్, డిసెంబరు 2:** ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే అయిదు, పదేళ్ల కాలంలో అణుయుద్ధం జరగొచ్చని పేర్కొన్నారు. ఎక్స్‌లో ఓ యూజర్ పోస్టుకు సమాధానంగా మస్క్ ఈ వ్యాఖ్యలుచేశారు. హంటర్ యాష్ అనే ఓ యూజర్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టాడు. 'అణ్వాయుధాలు ప్రధానశక్తుల మధ్య యుద్ధాన్ని,యుద్ధ ముప్పును నిరోధిస్తాయని ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు పిచ్చిగా నమ్ముతున్నాయి. కాబట్టి ఆ ప్రభుత్వాలపై బయటి శక్తుల నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదు' అని రాసుకొచ్చాడు. దీనికి ఎలాన్‌మస్క్ బదులిస్తూ యుద్ధం కచ్చితంగా జరుగుతుందని పేర్కొన్నారు. 'యుద్ధం అని వార్యం. 5,10 యేళ్లలో ఇది జరుగుతుంది' అని రాసుకొచ్చారు. అయితే, తన వ్యాఖ్యలపై మస్క్ ఎలాంటి వివరణఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్ శాఖలో పనిచేసిన మస్క్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది.

### ఇండియా ఆందోళనలు మాకు తెలుసు: రష్యా



**మాస్కో, డిసెంబరు 2:**భారత్-రష్యా సంబంధాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కీలక ప్రకటన చేశారు. వాణి జ్యలోటు విషయంలో భారత ఆందోళ నలు తమకు తెలుసని తెలిపారు. అం దుకే దాని సమన్వయం చేసేందుకు దిగుమతులను గణనీయంగా పెంచుకుంటా మని హామీ ఇచ్చారు. అలాగే ఉగ్రవాదంపై కలిసి పోరాడేం దుకు సిద్ధమని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యంపై ఇతర దేశాల ఒత్తిడిలేని వ్యాపార విధానాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉం దన్నారు. త్వరలో పుతిన్ భారత పర్యటనకు రానున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో రష్యా నుంచి ఇలాంటి ప్రకటన వెలువ డడం గమనార్హం. అమెరికా ఆంక్షలు విధించినప్పటికీ భారత్‌కు చమురు సరఫరా తగ్గకుండా చూసేందుకు రష్యా ప్రయత్నిస్తోందని పెస్కోవ్ తెలిపారు. భౌగోళిక రాజకీయాలకు అతీతంగా పనిచేసే ఒక వాణిజ్య వ్యవస్థను అభివృద్ధిచేయాలని రష్యా కోరుకుంటున్నట్లు వెల్లడించారు.

### ట్రంప్ ఆరోగ్యం భేష్: వైట్‌హౌస్ డాక్టర్



**వాషింగ్టన్, డిసెంబరు 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉందని వైట్ హౌస్ డాక్టర్ కెప్టెన్ షాన్ బార్బాబెల్లా పేర్కొ న్నారు. ఈమేరకు ట్రంప్ ఎంఆర్ఐ స్కానింగ్ వివరాలకు సంబంధించిన నివేదికను విడుదల చేస్తూ బార్బాబెల్లా మీడియాతో మాట్లాడారు. అధ్యక్షుడి ఆరోగ్యంపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఎంఆర్ఐ స్కానింగ్ లో ట్రంప్ గుండె పనితీరు బాగుందని తేలినట్లు డాక్టర్ వెల్లడించారు. ఆయన జ్ఞాపకశక్తి కూడా అద్భుతంగా ఉందన్నారు. ట్రంప్ వయసు ప్రస్తుతం 79 ఏళ్లని, ప్రస్తుతం ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ట్రంప్ వయసున్న వ్యక్తుల్లో సాధారణంగా కార్డియో వాస్కులర్ (గుండె), ఉదర సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున గత అక్టోబర్‌లో ఆయనకు సమగ్రమైన ఎంఆర్ఐ స్కానింగ్ నిర్వహించినట్లు డాక్టర్ బార్బాబెల్లా వెల్లడించారు. ఆ ఫలితాలను తాజాగా విడుదల చేసినట్లు తెలిపారు.

### యూపిలో బవేరియా గ్యాంగ్‌లీడర్ ఖతం



**షామ్లి(యుపి), డిసెంబరు 2:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, షామ్లి జిల్లాలోని కంద్లా ప్రాంతపు దట్టమైన అడవుల్లో అర్ధరాత్రి జరిగిన ఎదురు కాల్పుల్లో బవేరియా గ్యాంగ్ లీడర్ మిథున్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతనిపై రూ.1.25 లక్షల రివార్డు ఉందని, ఇతనిపై 20 కేసుల్లో అభియోగాలు ఉన్నాయని వెల్లడించారు. ఝింఝానా ప్రాంతంలో బవేరియా గ్యాంగ్ నేరపూరిత చర్యలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తోందని సోమవారం పోలీసులకు సమాచారం అందింది. సమాచారం ఆధారంగా పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు బృం దాలు ఆ గ్యాంగ్ ఉన్న ప్రాంతానికి చేరు కున్నాయి. అరెస్టు నుంచి తప్పించు కోవడానికి ముఠా సభ్యులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, దీంతో పోలీసులు ఎదురుకాల్పులు జరపడంతో మిథున్ మృతి చెందాడని అధికారులు తెలిపారు. అతని అనుచరుడు ఒకరు తప్పించుకున్నట్లు పేర్కొన్నారు.



మంగళవారం గాంధీభవన్‌లో మర్రి చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

## దూరదృష్టి కలిగిన నేత చెన్నారెడ్డి

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఘననివాళులు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మారదృష్టి కలిగిన నాయకుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి అని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ శ్లాఘించారు. మర్రిచెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఇందిరా పార్క్‌లోని మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. మహేష్‌కుమార్ ఈ సందర్భంగా చెన్నారెడ్డివ్యక్తిత్వాన్ని స్మరించుకొన్నారు. నేను చెన్నారెడ్డి కుటుంబసభ్యుడిని అని సగర్వంగా చెబుతున్నానని ప్రకటించారు. ఆయన నన్ను తన కొడుకులా భావించి, పివినరసింహారావుతో మాట్లాడి నాకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించారని గుర్తుచేసుకున్నారు. ప్రపంచంలో ఇంతకు ముందుకానీ, రాబోయే రోజుల్లో కానీ మర్రి చెన్నారెడ్డి వంటి నాయకుడు ఉండడని కొనియాడారు. గొప్ప దార్శనికుడు, మార్గదర్శి యావత్ దేశం చూసిన అరుదైన రాజనీతిజ్ఞుల్లో ఒకరని ఆయన అన్నారు. విషయ పరిజ్ఞానం విషయంలో ఆయనకు ఆయనే సాటి అనికీర్తించారు గవర్నర్ పదవికి వన్నె తెచ్చిన మహోను భావుడు డా. మర్రి చెన్నారెడ్డి అని తెలిపారు. గాంధీభవన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్ర పటానికి నివాళులు అర్పించిన టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి అజారుద్దీన్, వైస్ ప్రెసిడెంట్లు కుమార్‌రావు, జగదీష్, జనరల్ సెక్రటరీలు, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాలు

### కమాండ్ కంట్రోల్ నుంచి ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆరు వారాల సైబర్ అవగాహన కార్యక్రమం మంగళవారం ప్రారంభ మయ్యింది. కమాండ్ కంట్రోల్‌లో గల ఆడిటోరియంలో డిజిపి శివధర్ రెడ్డి దీనిని ప్రారంభించారు. విద్యా ర్థులతో పాటు భాగస్వామ్య శాఖల ప్రతినిధులు, ఆయా విభాగాల పోలీసు ఉన్నతాధికారులు, ఎస్‌బిఐ అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డిజిపి మాట్లాడుతూ సైబర్ నేరాలపై అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని కోరారు. సైబర్ నేరాల నివారణకు తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని ఆయన అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాల అధికారులు టిజిసిఎస్‌బితో సమన్వయం చేసుకుని నేరాలను అరికట్టాలని డిజిపి కోరారు. వచ్చే ఆరు వారాల పాటు ప్రతీ జిల్లాలో, ప్రతీ విభాగంలో, ప్రతీ పోలీసు స్టేషన్‌లో దీనికి సంబం ధించిన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఓటిపి, కెవైసి మోసాలు, లోన్ యాప్ వేధింపులు, సోషల్ మీడియా, ఎక్స్‌ట్రార్షన్ వంటి నేరాలపై అందరు అవగాహన పెంచుకోవాలని, దీనిద్వారా తమ తమ ప్రాంతా ల ప్రజలను చైతన్యవంతులను చేయాలని డిజిపి కోరారు. టిజిసిఎస్‌బి కృషి వల్ల తెలంగాణలో సైబర్ నేరాలు చాలా వరకు తగ్గాయని ఆయన అనా న్నరు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యా సంస్థల కోసం రూపొందించిన విజువల్‌ను ఆయన ప్రారంభించారు. ఇవి విద్యార్థులను విద్యా సంస్థల్లో సై బర్ అం బాసిడర్లుగా తీర్చిదిద్దుతాయని ఆయన తెలిపారు. దీంతో పాటు ఎస్‌బిఐతో కలిసి బ్యాంకింగ్ సిబ్బంది, ఇతర వర్గాల కోసం మరో అవగాహన కార్యక్రమాన్ని కూడా డిజిపి ప్రారంభించారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ దేశంలోనే బలమైన వ్యవస్థగా తమ విభాగం వు oదని తెలిపారు. ఇందులో ఎన్‌సిఆర్‌పికి అందిన 2.44 లక్షల ఫిర్యాదులు, 58,244 ఎఫ్ఐఆర్‌లు వున్నాయని, ఇదే సమయంలో టిజిసిఎస్‌బి ద్వారా ఇప్పటి వరకు 350 కోట్ల రూపాయలను సైబర్ బాధితులకు అందించామని ఆమె తెలిపారు. దేశంలో సైబర్ నేరాలు 29 శాతం పెరిగాయని, తెలంగాణలో మాత్రం ఎనిమిది శాతం తగ్గాయని, ఇందుకు పోలీసుల సమిష్టి కృషి వుందని శిఖా గోయల్ తెలిపారు. దేశ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల వల్ల డబ్బులు పోగొట్టుకున్న కేసులు ఆరు శాతం తగ్గితే తెలంగాణలో ఇది 30 శాతం తగ్గాయని ఆమె చెప్పారు. సైబర్ బాధితులు నేరాలు జరిగిన వెంట నే 1930కి ఫోన్ చేయాలని ఆమె కోరారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలను మరింత చైతన్యవంతులను చేసేందుకు ఆరువారాల అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. కనీసం ఐదు లక్షల మందికి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కలిగించాలని త మ లక్ష్యమని ఆమె తెలిపారు. ఇందుకుగాను ఒక్కో వారంలో ఒక్కో అంశంపై అవగాహన కార్యక్రమం వుంటుందని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల అవగాహనకు సంబంధించిన వాల్ పోస్టర్లు, చిత్రాలను శివధర్‌రెడ్డి, శిఖాగోయల్ సహా ఇతర ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ కా ర్యక్రమంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్, సిటీ కొత్వాల్ సజ్జనార్, నిఘా విభాగం అదనపు డిజి వి జయ్ కుమార్, సైబరాబాద్ కొత్వాల్ అవినాష్ మొహంతి, రైల్వేస్ ఐజి రమేష్ నాయుడు, ఈగల్ డిఐజి అభిషేక్ మొహంతి, కమాండ్ కంట్రోల్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ కళలు.. సంస్కృతికి అద్దంపట్టేలా

## గ్లోబల్ సమ్మిట్‌లో అతిథులకు ప్రత్యేక బాస్కెట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** గ్లోబల్ సమ్మిట్ హాజరయ్యే ప్రముఖులకు, అతిథుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బాస్కెట్‌లను అందజేయనుంది. ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగే తెలం గాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు ప్రపంచం నలుమూలల నుంచి కార్పొరేట్ ప్రతి నిధులు, పరిశ్రమల ప్రముఖులు, పెట్టు బడిదారులు హాజరుకానున్నారు. వీరి కోసం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా స్వాగతం పలకనుంది.

హైదరాబాద్‌కు చేరుకున్న వెంటనే వారికి ఎప్పటికి గుర్తిండిపోయేలా సాంప్రదాయ కిట్లు, రుచికరమైన వంటకాలతో కూడిన ఫుడ్ బాస్కెట్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కిట్‌లో ఏముం టాయంటే.. సదస్సుకు హాజరయ్యే అతిథులకు అందించే స్పెషల్ బాస్కెట్ లో పోచంపల్లి ఇక్కత్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగోతో కూడిన సావనీర్ కిట్లను అందించనున్నారు. పోచంపల్లి శాలువా, చేర్యాల మాస్క్(పెయింటిగ్స్), హైదరాబాద్ అత్తర్, హైదరాబాద్ ముత్యాలతో చేసిన ఆభరణాలు ఇందులో ఉంటాయి. అదేవిధంగా ప్రత్యేక డిజైన్‌తో సిద్ధం చేసిన కల్చరల్ ఫుడ్ బాస్కెట్‌లో మహువ లడ్డులు, సకినాలు, అప్పాలు, బదామ్ కీ జాలి వంటి తెలంగాణ సాంప్రదాయ వంటకాలు ఉండ నున్నాయి. ఈ సమిట్ ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతి, వంటకాల ప్రత్యేకతను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్నారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి తదితరులు

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 311

**హైదరాబాద్ (బేగంపేట), డిసెంబరు 2, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 311దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 113దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 34 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 87 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 24దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి సంబంధించి 1 దరఖాస్తు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 52 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు.

# పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి

### అడ్డగోలు పోకడలపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి: ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మొదలైన పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలని, రాజకీయ పార్టీల జోక్యం ఉండకూడదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాం డ్ చేసింది. బలవంతపు ఏకగ్రీవాలు, లక్షలాది రూపాయలు పోసి సర్పంచ్ పోస్టులను కొనుగోలు చేయడం వంటి అడ్డగోలు పోకడలపై ఎన్నికల సంఘం విచారించి ఎక్కడైనా తప్పులు వుంటే అక్కడ వెంటనే చర్యలు తీసుకోవాలని సంఘం కార్యదర్శి పద్మనాభరెడ్డి కోరారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ మంగళవారం విశ్రాంత బ్యూరోక్రాట్లతో పాటు ఆయా రంగాల ప్రముఖు లతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించిందని, ఇందులో పాల్గొన్న వారంతా ఈ ఎన్నికలు ప్రజా సామ్యబద్ధంగా జరగాలని ముక్త కంఠంగా కోరారు. దీనిపై పద్మనాభ రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిజాయి తీపరులైన సర్పంచులు గెలవాలని, అక్రమాలకు తావులేకుండా వుండాలని, ఇందు కోసం ఆయా ప్రాంతాలలోని విద్యా వంతులు, యువత కృషి చేయాలని ఆయన కోరారు.

ఇప్పటి వరకు ఎన్నిక లకు సంబంధించి జరిగిన పద్ధతులు చూస్తుంటే చాలాచోట్ల రాజకీయ పార్టీల ప్రమేయం వున్నట్లు కనిపిస్తోందని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన తెలిపారు. చాలాచోట్ల ఏకగ్రీవాలు ఇష్టానుసారం, అడ్డగోలుగా జరిగి నట్లుగా వుందని ఆయన వెల్లడించారు, కొన్నిచోట్ల కొందరు అభ్యర్థులను బలవంతంగా విత్‌డ్రా చేయించడం కూడా సరైంది కాదని ఆయన తెలిపారు. దీనిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకొన్నిచోట్ల లక్షల రూపాయలు వెచ్చించి సర్పంచ్ పోస్టులను కొంటున్నట్లు వార్తలు వస్తున్నాయని ఇది కూడా మంచిది కాదని ఆయన తెలిపారు. మొదటి దఫా, రెండవ దఫా ఫలితాలు వెంటనే వెల్లడించకుండా మూడవ దఫా అయిన తరువాత ఈ నెల 17న వెల్లడించాలని పద్మనాభ రెడ్డి కోరారు. సమావేశంలో విశ్రాంత ఐఎఎస్ అధికారులు చంద్రవదన్, ఎం.విరెడ్డి పాల్గొన్నారు.



డా.చిన్నారెడ్డిని కలిసి సమస్యను వివరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు

## త్వరలో ల్యాబ్ టెక్నీషియన్స్ పోస్టింగ్‌లు

**హైదరాబాద్ (బేగంపేట), డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన 1,260 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.చిన్నారెడ్డి తెలియజేసారు. మంగళవారం జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో జరిగిన సీఎం ప్రజావాణి జరుగుతున్న ప్రజాభవన్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమకు పోస్టింగ్స్ వీలైనంత త్వరగా ఇప్పించాలని కోరారు. వైద్య శాఖ ఉన్న తాధికారులతో మాట్లాడిన చిన్నారెడ్డి త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు ల్యాబ్ టెక్నీషియన్స్‌కు తెలియజేసారు.

# జీవన మార్గదర్శకం చేసిన గురువులను మరువరాదు



శ్రీరంగాచార్యను విశ్వవిద్యాలయ వ్యవస్థాపన దినోత్సవ విశిష్ట పురస్కారంతో సత్కరిస్తున్న రమణాచారి, హను మంతరావు, రాధాసారంగపాణి తదితరులు

### తెలుగు విశ్వవిద్యాలయం 40వ వ్యవస్థాపన దినోత్సవంలో డా. కె.వి.రమణాచారి

### ప్రముఖ సాహితీవేత్త డా. శ్రీరంగాచార్యకు విశిష్ట పురస్కారం ప్రదానం

**హైదరాబాద్ (నాంపల్లి), డిసెంబరు 2, ప్రభాతవార్త :** విద్యార్థులకు విద్యతోపాటు జీవన మార్గదర్శకం చేసిన గురువులను మరచిపోకూడదని, సందర్భో చితంగా వారిని సత్కరించుకోవాలని విశ్వవిద్యా లయ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి హితబోధ చేశారు. తెలుగుభాషా, సాహిత్య వికాసమే లక్ష్యంగా ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయం 40వ వ్యవస్థాపన దినోత్సవం మంగళవారం తెలుగు విశ్వ విద్యాలయంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. కోట్ల హనుమంత రావు సభాధ్య క్షతన కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి. రమణాచారి విశ్వ విద్యాలయం వ్యవస్థాపన దినోత్సవాన్ని పురస్క రించు కుని ప్రతీ యేటా వివిధరంగాల్లో నిష్ణాతులైన ఒకరిని విశ్వవిద్యా లయం ఎంపికచేసి నగదు బహుమతితో విశిష్ట పురస్కారాన్ని బహూ కరణలో భాగంగా ఈ సంవత్సరం సాహిత్య రంగంలో విశేషకృషిచేసిన ప్రముఖ సాహితీవేత్త డా. శ్రీరంగాచార్యను విశిష్ట అతిథి ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, విశ్వవిద్యాలయ విస్తరణసేవా విభాగం ఇన్‌చార్జ్ ఆచార్య రాధా సారంగపాణి తదితరులతో కలిసి సత్కరించి లక్ష నగదు, ప్రశంసాపత్రం, ప్రత్యేక జ్ఞాపికనుతో 40వ వ్యవస్థాపన దినోత్సవ విశిష్ట పురస్కారం ప్రదానం చేసి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. సార సత్వరంగంలో నిత్య అధ్యయనం చేస్తూ విశేషగ్రంథ రచన లనుచేసి మహబూబ్ నగర్ పాలెం ప్రాచ్య కళాశాలలో అధ్యా పకుడుగా రాణించి తన విద్యార్థులను సాహిత్యరంగంలో ని ష్ణాతులుగా తీర్చిదిది లబ్ధప్రతుష్టులను చేసిన సాహితీమూర్తి శ్రీరంగా చార్య అని కొనియాడారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్య క్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు ప్రత్యక్ష గురువైన శ్రీరంగాచార్యను విశిష్ట పురస్కారంతో సత్కరించు కోవడం అభినంద నీయమని రమణాచారి అన్నారు. పురస్కార స్వీకర్త శ్రీరంగాచార్య భాషా వైయుక్తంతో తన జీవితకాల మంతా మనో వాక్కా యకర్మలను ఆచరించి తెలుగుభాషా పరి రక్షణకు సాహిత్యకృషి చేస్తానని భరోసానిచ్చారు. సురవరం ప్రతాపరెడ్డి పేరిటన మారిన తెలుగు విశ్వవిద్యా లయం వారి ఆశయాలకు అనుగుణంగా తెలుగు భాషా పరిణామం మరింత వృద్ధిలోకి రావడానికి కృషిచేయాలని ఆకాంక్షించారు. కోట్ల హనుమంత రావు అధ్యక్షోపన్యాసంలో విద్యాలయ స్థాపన లక్ష్యం, ధ్యేయానికి చేస్తున్న కృషి వివరించారు.

# ఈ యేడాది పెరగనున్న ఇంటర్ పరీక్షా కేంద్రాల సంఖ్య!

### ఇప్పటి వరకు 9.79 లక్షల మంది ఫీజు చెల్లింపు

### అపరాధ రుసుంతో 15 వరకు అవకాశం

### ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకి పరీక్షా కేంద్రాల సంఖ్యను గత ఏడాది కంటే పెంచనున్నారు. గత ఏడాది 1532 పరీక్షా కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయగా.. ఈ ఏడాది అంతకంటే ఎక్కువ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రారంభించినట్టు తెలుస్తోంది ఏడాది ఇంటర్ పరీక్షలకి 9,96,971 మంది హాజరు కాగా.. వారి కోసం 1532 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది గత ఏడాది కంటే ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారనే అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే 9,79,747 మంది విద్యార్థులు ఫీజును చెల్లించారని.. మరో 61వేల మంది ఫీజు చెల్లించాల్సి ఉన్నట్టు అధికారిక అడ్మిషన్లను బట్టి తెలుస్తోంది. ఈ ఏడాది 10 లక్షల కంటే ఎక్కువ మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉన్నందున .. ఈ ఏడాది పరీక్షా కేంద్రాల సంఖ్యను గత ఏడాది కంటే ఎక్కువ ఏర్పాటు చేయాల్సి వస్తుందని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

నవంబర్ 1 నుంచి ప్రారంభమైన ఫీజు చెల్లింపు గడువు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా నవంబర్ 14తో ముగిసింది. అపరాధ రుసుం రూ. 100తో నవంబరన 16 నుంచి 24 వరకు, రూ. 500తో నవంబరన 26 నుంచి డిసెంబరు 1 వరకు స్వీకరించారు.

అపరాధ రుసుం రూ. 1000తో నేటి(డిసెంబరు 3) నుంచి ఈ నెల 8 వరకు, రూ. 2000 అపరాధ రుసుంతో ఈ నెల 10 నుంచి 15 వరకు అవకాశం కల్పించారు. పరీక్ష ఫీజు మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులకు రూ. 530, ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌కి రూ. 100, మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులకు రూ. 870. సెకండియర్ జనరల్ ఆర్ట్స్ విద్యార్థులకు రూ. 530 ఇంగ్లీష్ ప్రాక్టికల్‌కి రూ. 100, సెకండియర్ జనరల్ సైన్స్ విద్యార్థులకు, సెకండియర్ ఒకేషనల్ విద్యార్థులకు రూ. 870గా ఫీజును నిర్ణయించారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు జరగనున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి

### పెంచలయ్య హత్య బాధ్యులను కఠినంగా శిక్షించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వా లను డిమాండ్ చేశారు. ఏపిలోని నెల్లూరు జిల్లాలో పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠి నంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరులో డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేసి, పోరాడుతున్న సీపీ ఎం, యువజన సంఘం నాయకుడు, ప్రజానాట్య మండలి కళాకారుడైన కె.పెంచలయ్యను డ్రగ్స్ మాఫియా అతిదారుణంగా హత్య చేసిన ఘటనను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంద న్నా రు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన డ్రగ్స్ మాఫియా డాన్ కామాక్షిని, ఆమె భర్తను, వారికి సహాయపడిన అనుయాయులను కఠినంగా శిక్షి ం చాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా బంద్‌కు, రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిపిఎం ఆంధ్ర ప్రదేశ్ కమిటీ ఇచ్చిన పిలుపులకు సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ సంఘీభావం తె లియజేస్తుందన్నారు. డ్రగ్స్ మాఫియాని అరికట్ట డంలో తెలుగు రాష్ట్రాలు పూర్తిగా విఫలమవు తున్నాయని, ప్రభుత్వాలు, అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో తెలుగు రాష్ట్రాల్లోని పట్టణాలు, గ్రామాల వరకు విచ్చలవిడిగా డ్రగ్స్ సరఫరా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కఠినంగా మాట్లాడుతున్నప్పటికీ, ఆచ రణలో డ్రగ్స్‌ను పూర్తిగా అరికట్టేందుకు తీసు కుంటున్న చర్యలు సరిపోవన్నారు. యువతను డ్రగ్స్‌కు దూరమయ్యే పద్ధతుల్లో చైతన్యం కల్పిం చాలని, ఉమ్మడి రాష్ట్రాల్లో డ్రగ్స్‌ను అరికట్టకపోతే తీవ్రమైన అరాచకాలు, హత్యలు జరిగే పరిస్థితులు నెలకొంటాయని జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్ప టికైనా డ్రగ్స్ మాఫియాను ఉక్కుపాదంతో అణిచి వేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

## వీధికుక్కల దాడి.. బాలుడికి తీవ్రగాయాలు

**హైదరాబాద్ (హాయత్‌నగర్), డిసెంబరు 2, ప్రభాతవార్త :** వీధి కుక్కల దాడిలో మూగ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతి రావు, చంద్రకళ దంపతులు నగరానికి తరలివచ్చి భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ మూడేళ్లుగా మన్సురాబాద్ డివిజన్ శివగంగ కాలనీలో నివాసం ఉంటు న్నారు. వారి కుమారుడు ప్రేమ్‌చంద్ (7) పుట్టుకతో మూగవాడు. మంగళ వారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా తల్లి ఇంట్లో పని చేసుకుంటోంది. ఆడుకుంటూ ఇంట్లో నుండి బయటకు వచ్చిన బాలుడిపై సుమారు 10, 15 వీధి కుక్కలు ఒక్క సారిగా దాడికి దిగాయి. కుక్కల దాడిలో బాలుడి శరీరమంతా తీవ్ర గాయా ల య్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమి వేశారు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అధికారులపై కొప్పుల ఆగ్రహంకుక్కల దాడి విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాలుడిని ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టారు. డివిజన్లో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని పిల్లలు, పెద్దలపై కుక్కలు దాడులు చేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతు ప్రేమికులు ఇలాంటి సంఘ టనతోనైనా కనులు తెరవాలన్నారు. బాలుడి వైద్య ఖర్చులను జీహెచ్ఎంసీ భరించాలన్నారు.



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

## బర్దీపూర్‌లో భార్యను చంపి భర్త ఆత్మహత్య

### కుటుంబ కలహాలే కారణం!



శ్రీశైలం, మంజుల (ఫైల్)

**టేక్మాల్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** కుటుంబంలో ఏర్పడిన కలహాలతో భార్యను చంపి భర్త ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్దిపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన గంగారం శ్రీశైలం(37), మంజుల (34) కాపురంలో కుటుంబకలహాలు మొదలై హత్య, ఆత్మహత్యకు దారితీసింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబకలహాల నేపథ్యంలో భార్యను చంపి భర్త ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నారని గ్రామస్తులు చెబు తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్‌టీం బృందం ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు ఈ మేరకు కేసు నమోదు చేసుకోని శవాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# టెట్‌కు 49,236 మంది ప్రభుత్వ టీచర్లు దరఖాస్తు

### సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 15 నుంచి 20 యేళ్లు బోధన అనంతరమే..

### ప్రైవేటు టీచర్లు 22,434 మంది కూడా..

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించిన దరఖా స్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేసే వారు, ప్రైవేటు స్కూల్స్ లో పనిచేసే వారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్- 2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ప్రైవేటు స్కూళ్లలో ఇప్పటికే విద్యా బోధన చేస్తున్న వారు 22,434 మంది టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టెట్ దరఖాస్తు ప్రక్రియ ముగిసేనాటికి 2,37,754 దరఖా స్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయల నుంచి 71,670 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. వాటిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పాఠాలు బోధిస్తున్న వారి నుంచి పేపర్-1 పరీక్షకి 15,672 మంది, పేపర్-2 పరీక్షకి 33,564 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు పేపర్లకి కలిపి 11,719 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా ప్రభుత్వం టీచర్లు 60,955 దరఖాస్తులను టెట్-2026కి చేశారు.

ప్రైవేటు టీచర్లలో పేపర్-1కి 15,672 మంది దరఖాస్తు చేసుకోగా, పేపర్-2కి 10,717 మంది దరఖాస్తు చేసుకున్నారు. టెట్-2026కి దరఖాస్తు గడువు లోపు పేపర్-1కి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 27,389 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 58,149 దరఖాస్తులు కలిపి మొత్తం పేపర్-1కి 85,538 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-2కి సంబంధించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 44,281 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 1,07, 935 దరఖాస్తులతో కలిపి మొత్తం పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-1, 2కి కలిపి 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. టెట్‌పై సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ జీఓలో సవరణలు చేసి కొత్తగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు ప్రకారం.. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని తీర్పును వెలువరించింది. తీర్పు ఇచ్చిన తర్వాత రెండేళ్లలో అంటే 2027 నాటికి టెట్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొంది. టెట్ ఉత్తీర్ణత కాని పక్షంలో ఉద్యోగం వదులుకోవాలని తెలిపింది.

అయితే ఐదేళ్లలో పదవీ విరమణ చేయబోయేవారికి మాత్రమే టెట్ అవసరం లేదని చెబుతూనే.. వారు పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ పాసవ్వాలని స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం మార్చి 31, 2010 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి టెట్ అవసరం లేదని ఎన్‌సిటిఈ గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే దానిని పరిగణనలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 1న టెట్ తప్పనిసరి అంటూ తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. 2010 కంటే ముందు ఉన్న వారికి టెట్ అవసరం లేకపోవడంతో.. వారు ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఇప్పటికే 15 సంవత్సరాలు దాటిపోయింది. అంతకంటే ముందు ఉన్న టీచర్లుగా నియమితులైన వారు కూడా అయితే సుమారు 20 నుంచి 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న వారు ఉన్నారు. వారిలో సర్వీస్ మరో 10 నుంచి 12 ఏళ్ల వరకు ఉన్న వారు సైతం ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే 25 సంవత్సరాలకుపైగా టీచింగ్ వృత్తిలో ఉన్నవారు కూడా ఇపుడు టెట్ పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలుస్తోంది. టెట్- 2026 పరీక్షలను జనవరి 3 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. పరీక్షలకి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. టెట్-2026 ఫలితాలను ఫిబ్రవరి 10 నుంచి 16 మధ్యలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# రాష్ట్ర ఖజానాకు రూ.16,372 కోట్ల జమ

## తొలిసారి రికార్డుస్థాయి ఆదాయం

## రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే అత్యధికం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత, రాష్ట్రం ఏర్పడిన తదుపరి తొలి సారి పన్నుల ద్వారా ఖజానాకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ అంచనాల్లో సగానికి పైగా ఆదాయం గత ఏడు నెలలో కాలంలో వచ్చాయి. 2025-26 వార్షిక అంచనా బడ్జెట్ ప్రకారం రూ.2,83 లక్షల కోట్లకు గాను అన్ని రాబడులు, అప్పులు కలిపి రూ.1.45 లక్షల కోట్ల చొప్పున సమకూరాయి. ఇది బడ్జెట్ అంచనాల్లో 51 శాతం కావడం గమనార్హం. ఇందులో పన్నుల ఆదాయం రూ.88 వేల కోట్లు కాగా, అప్పులు రూ.50 వేల కోట్లు దాటాయి. ఒక్క అక్టోబరులోనే సరక్కార్ రూ.5 వేల కోట్ల వరకూ రుణాలు సేకరించింది. నవంబరు నెలలో రూ.5 వేల కోట్లు తీసుకోగా, మరో రూ.6 వేల కోట్లను ఈ నెల 2న ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టడం ద్వారా సేకరించనుంది. దీంతో ఈ నెల ముగిసే సమయానికి రుణాల కింద రూ.60 వేల కోట్లు దాటే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఈ ఏడాది అక్టోబరు నెలలో పన్నుల ఆదాయం ప్రభుత్వానికి అత్యధికంగా సమకూరింది. ఆ నెలలో ఖజానాకు ఏకంగా రూ.16,372 కోట్లు లభించింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనర్ ప్రభుత్వానికి అక్టోబరు నెల ఆదాయ, వ్యయాలకు సంబంధించిన నివేదికను సమర్పించింది. ఇంత భారీ స్థాయిలో ఒకే నెలలో పన్నుల ఆదాయం రావడం ఇదే మొదటిసారని ఆర్థిక శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా ప్రతీ నెలా ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.1,000 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, అక్టోబరులో ఏకంగా అది రూ.3,675 కోట్లకు పెరుగుదల చోటు చేసుకుంది. ఇదే సమయంలో మిగిలిన పన్నుల రాబడుల్లో ఎంత మాత్రం తగ్గుదల లేకపోవడంతో అక్టోబరులో పన్నుల ఆదాయంలో రికార్డు సృష్టించింది.

# 10 నుంచి రవాణా వాహనాల బంద్

## ఫిట్‌నెస్ ఛార్జీల పెంపునకు నిరసనగా ఎస్ఐఎంటిఏ నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఈ నెల 10 నుంచి రవాణా వాహనాల బంద్‌ను పాటించాలని సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్(ఎస్ఐఎంటిఏ) నిర్ణయించింది. రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ చార్జీలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు నిరసనగా సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ దేశవ్యాప్త బంద్‌కి పిలుపునిచ్చింది. ఈనెల 10 నుంచి బంద్ పాటించాలని నిర్ణయించినట్టు ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ సౌత్‌జోన్ ఉపాధ్యక్షులు వైవీ ఈశ్వరరావు తెలిపారు. 12 ఏళ్ల పైబడిన వాహన యజమానులు ఈబంద్‌లో పాల్గొంటారని, తమ డిమాండ్లు నెరవేరే వరకు బంద్ కొనసాగుతుందని తెలిపారు.

# సీల్డుకవర్‌లో సిఐడి దర్యాప్తు

## నిందితుడి తరపున న్యాయవాది అభ్యర్థన తిరస్కరణ

## పరకామణి కేసు విచారణ 5వ తేదీకి వాయిదా

**తిరుమల, డిసెంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరు మల పరకామణి చోరీ కేసులో సిఐడి అధికారులు చేపట్టిన దర్యాప్తు వివరాలను సీల్డ్‌కవర్‌లో మంగళవారం అధికారులు హైకోర్టుకు నివేదించారు. రిజిస్ట్రార్ జ్యూడీషియల్ ద్వారా న్యాయమూర్తికి నివేదికలను అందజేయడంతో తదుపరి 7వతేదీ శుక్రవారానికి ఈ కేసు విచారణ వాయిదా వేశారు. 26 రోజుల పాటు 35 మంది వరకు సాక్షులను, అధికారులను, మాజీ ఛైర్మన్‌లను, ఫిర్యాదిదారు లను, నిందితుడ్ని పలు కోణాల్లో విచారణ చేసి రాబట్టిన వివరాలను రికార్డుచేసి 156పేజీల నివేదికలను మంగళవారం న్యాయమూర్తి ముందు ఉంచారు. దీంతో ఈకేసు విచారణ చేపడితే తదు పరి ఎలాంటి ఆదేశాలు,ఉత్తర్వులు వెలువడిస్తారని అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. అయితే శుక్రవారానికి వాయిదా వేయడంతో అప్పటివరకు ఆ సీల్డుకవర్‌లో నిక్షిప్తమైన వివరాలు, ఆధారాలు ఏమిటనేది టిటిడి వర్గాల్లో, రాజకీయనేతల్లో ఆసక్తి కరమైన చర్చమొదలైంది. 2023లో జరిగిన పరకామణిలో చోరీ కేసు 920 అమెరికన్ డాలర్లను గుమస్తా సివి రవికుమార్ దొంగతనం చేయడం, దీనిపై అప్పటి ఎవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ పట్టుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. దానిపై పోలీసులు కేసునమోదు చేశారు. అనూహ్య రీతిలో ఈ కేసులో దర్యాప్తు అనేక మలుపులు తిరగడం, ఏకంగా అప్పటి టిటిడి బోర్డు పెద్దలు నిందితుడు రవికుమార్ నుండి 14కోట్ల రూపా యలు విలువచేసే ఆస్తులను శ్రీవేంకటేశ్వరస్వామికి కానుకగా స్వీకరించడం జరిగిపోయింది. అప్పటికే ఈకేసులో నిందితుడ్ని కాపాడి లోక్‌అదాలత్‌లో రాజీచేసుకున్నారు. అక్కడికి భక్తులు సమర్పించిన కానుకల చోరీ కేసు మూసివేశారు. అయితే గత ఏడాది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో హైకోర్టులో శ్రీనివాసులు అనే వ్యక్తి పిటిషన్‌తో హైకోర్టు న్యాయమూర్తి విచారణకు ఆదేశించడం, తిరిగి మూసేసిన కేసులో సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ నవంబర్ 6వతేదీ నుండి ప్రత్యేక బృందాలతో సమగ్రంగా క్షేత్రస్థాయిలో లోతైన దర్యాప్తు చేపట్టారు.

# రక్షణరంగ సాంకేతికతలో మరో కొత్త రికార్డు!

## రాకెట్ స్లెడ్ టెస్ట్ సక్సెస్ చేసిన డిఆర్‌డిఒ

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** రక్షణ సాంకేతికతలో భారత్ మరో రికార్డును నమోదుచేసింది. భారతక్ష రక్షణ పరిశోధనా సంస్థ డిఆర్‌డిఒ యుద్ధవిమాన పైలట్ ఎస్కేప్ సిస్టమ్‌కు సంబంధించిన హైస్పీడ్ రాకెట్‌స్లెడ్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మంగళవారం రక్షణ మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ప్రకటించింది. ఈ పరీక్ష స్వదేశీ యుద్ధవిమాన రక్షణ సాంకేతికతలో ఒక పెద్ద అడుగుగా భావిస్తున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ 'ఎక్స్' పోస్ట్‌లో టెస్ట్‌కు సంబంధించిన వీడియోను షేర్ చేసింది.



ఈ టెస్ట్ చండీగఢ్‌లోని టెర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ లాబొరేటరీలో ఉన్న రైల్ ట్రాక్ రాకెట్ స్లెడ్ ఫెసిలిటీలో గంటకు 800 కిలోమీటర్ల వేగంతో నిర్వహించింది. ఈ విజయంతో పైలట్ ఎజెక్షన్ సిస్టమ్‌ను పూర్తిగా పరీక్షించగలిగే సామర్థం ఉన్న దేశాల జాబితాలో భారత్ కూడా చేరింది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఈ ఎస్కేప్ సిస్టమ్‌ను పరిమిత వేగంతో పరీక్షించారు. కానోపీ సెవెరెన్స్, ఎజెక్షన్ సీక్వెన్స్, ఎయిర్‌క్రూ రికవరీ ప్రక్రియ వంటి అన్ని దశలు విజయవంతమయయాయి. ఈ టెస్ట్‌ను ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సంయుక్తంగా నిర్వహించాయి. డైనమిక్ ఎజెక్షన్ టెస్టులు చాలా క్లిష్టమైనవి, స్టాటిక్ పరీక్షలకంటే నమ్మదగినవి. ఈ పరీక్షలో ఎల్‌సీఏ యుద్ధవిమానం ముందు భాగాన్ని ప్రత్యేకంగా రూపొందించిన డ్యూయల్ స్లెడ్‌కు అమర్చి, పలు రాకెట్ మోటార్స్‌ని దశలవారీ ఇగ్నిషన్ ద్వారా నియంత్రిత వేగంతో ముందుకు దూసుకెళ్లేలా చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన మానవాకార డమ్మీ సహాయంతో పైలట్‌కు వచ్చే లోడ్స్, మోమెంట్లు, యాక్సిలరేషన్ వంటి కీలక డేటాను నమోదు చేశారు. మొత్తం పరీక్షను హైస్పీడ్ కెమెరాలతో రికార్డ్ చేశారు. ఈ పరీక్షను భారత వాయుసేన, వైమానిక వైద్య, ధ్రువీకరణ సంస్థల అధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ విజయంపై డీఆర్డీవో, ఐఏఎఫ్, ఏడీఏ, హెచ్‌ఏఎల్‌తో పాటు రక్షణ రంగ సంస్థలను అభినందించారు. స్వదేశీ రక్షణ సాంకేతికను బలోపేతం చేయడంలో ముందడుగని పేర్కొన్నారు.

# మనీలాండరింగ్ కేసులతో సోనియా, రాహుల్‌ను బెదరించలేరు

## ఆడబిడ్డకు సారెగా చీరె.. డిసెంబరులోగా 65లక్షల చీరెల పంపిణీ లక్ష్యం

## ఉస్మానియా వర్సిటీకి 7న వెళతా, నిధులు విడుదల చేస్తా

## గాంధీభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన పిసిసి కార్యవర్గ, డిసిసి అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై మనీల్యాండరింగ్ నీలాపనిందలు మోపి బెదరిస్తామంటే కాంగ్రెస్ శ్రేణులు ఎవ్వరు బెదరరని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజెపి ప్రభుత్వంకు స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన టిపిసిసి కార్యవర్గ, డిసిసిసి అధ్యక్షుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఓట్ చోరీ కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా తీసుకెళ్లారు ఆవిషయాన్ని దృష్టి మరల్చేందుకు మళ్లీ కేసుల పేరుతో హడావుడి చేస్తున్నారు మనీ ల్యాండరింగ్ కేసు పెట్టి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లను వేధిస్తున్నారని విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించడంతో పాటు సర్వం త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిదని ఆయన అన్నారు. గాంధీ కుటుంబం సొంత ఆస్తులతో నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రారంభించారని, దేశ స్వాతంత్రసమరంలో కీలకపాత్ర పోషించిందని రేవంత్ గుర్తుచేసుకున్నారు. నేషనల్ హెరాల్డ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థికంగా నిలబడేందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కృషి చేశారనీ, తిరిగి పత్రికను పునరుద్ధరించడానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అవసరమైంది అందుకే మల్లికార్జున ఖర్గే లాంటి కాంగ్రెస్ ముఖ్య నాయకులను బోర్డు డైరెక్టర్లుగా నియమించి పత్రికను పునరుద్ధరించిందని ముఖ్యమంత్రి వివరించారు. ఇందులో ఏ ఒక్క రూపాయి ప్రభుత్వానికి సంబంధం లేదు నెహ్రూ వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పత్రికను నడిపారని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై పెట్టిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేస్తున్నాం అని ఆయన ప్రకటించారు.సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి అండగా నిలబడతామని, అవసరమైతే ఎందాకైనా పోరాడతామని సందేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి ఇవ్వదలచుకున్నామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మనం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కొత్తగా నియామకమైన డిసిసిలకు ఉద్బోదించారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. కోటి మందికి కోటి చీరలను ఆడబిడ్డలకు సారెగా అందిస్తున్నామని వివరించారు. ప్రతీ ఆడబిడ్డకు చీర చేరేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులదే అని తెలిపారు. గ్రామలవారీగా సమన్వయం చేసుకుంటూ పంపిణీ పూర్తి చేయాలని సిఎం కోరారు. డిసెంబర్ లోగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ పూర్తయ్యేలా చూడాలని లక్ష్యం నిర్ధేశించారు. పట్టణ ప్రాంతాల్లో మార్చి నెలలో మహిళలకు 35 లక్షల చీరలను పంపిణీ చేయాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, పరిపాలనపై గ్రామ గ్రామాన చర్చ పెట్టండని ఆయన ఉద్బోదించారు. సంక్షోభంలో మనకు రాష్ట్రాన్ని అప్పగిస్తే సంక్షోభం నుంచి సంక్షేమం వైపు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నామని ఆయన అన్నారు. 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చి దిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 7 న ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కాలేజీ ముందు సభ పెట్టి యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చి దిద్దుతామని వివరించారు. 8,9 న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించుకుంటున్నామనితెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించుకో బోతున్నామని ప్రకటించారు. కోర్ అర్బన్ లో సమస్య లను దృష్టిలో పెట్టుకుని క్యూర్ చేయాలని నిర్ణయించుకున్నాం అని ఆయన తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ బయటకు తరలిస్తాంరీజనల్ రింగ్ లోపల ఉన్న పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (పియుఆర్ఇ) ప్రాంతంలో పరిశ్రమలకు ఏర్పాటు చేసుకోబోతున్నామని వివరించారు. రీజనల్ రింగ్ రోడ్ బయట రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ (ఆర్ఎఆర్ఇ) ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకోబోతున్నాం అంటు డిసిసిలకు తెలిపారు. తెలంగాణలో మరో నాలుగు విమా నాశ్రయాలు, ఒక డ్రై పోర్టు ఏర్పాటు చేసుకోబోతున్నామని చెప్పారు. కేంద్రంతో కొట్లాడి హైదరాబాద్ బెంగుళూరు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయించుకున్నామని అన్నారు. 'పనులు చేయడమే కాదు రాజకీయాల్లో చేసింది చెప్పుకోవాలి మనం చేస్తున్న పనులు, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిం చాలి' అని ఆయన సూచించారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు అనేది గొప్ప బాధ్యనిరక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజకీయాల్లో కాళ్లలో కట్టెలు పెట్టడం సహజమని అది పెద్దసమస్యగా భావించొద్దు అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు.

# పార్లమెంట్‌లో రెండోరోజూ అదే సీను

## సర్‌పై చర్చకు విపక్షాలు పట్టు

## ఉభయ సభలు పలుమార్లు వాయిదా

## పార్లమెంట్ వెలుపల ప్రతిపక్షాల ఆందోళన

## సంచార్ సాథీ యాప్‌పైనా రగడ

## ఆ యాప్ ఐచ్ఛికమన్న ప్రభుత్వం



**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** పార్లమెంట్‌లో రెండోరోజూ రభస చోటుచేసుకుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా విపక్షాలు ఆందోళనకు దిగడంతో ఉభయసభలు దద్దరిల్లాయి. ఓట్ చోరీ, గద్దీ చోరీ అంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేశారు. ఫలితంగా ఉభయసభల్లో గందరగోళం నెలకొన్నది. మంగళవారం కూడా ముందుగా వందేమాతరంపై చర్చకు ప్రభుత్వం పూనుకోగా.. సర్‌పై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. సభా కార్యకలాపాలకు అంతరాయం కల్గించొద్దంటూ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనా పరిస్థితిలో మార్పులేదు. మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ పునఃప్రారంభమైనా మళ్లీ అదే రిపీట్ అయ్యింది. దాంతో స్పీకర్ సభను రేపటికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ సర్‌పై చర్చకు ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు.

పలుమార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ వెలుపల ప్రతిపక్ష సభ్యులు సర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం బిజెపికి ఓట్లు దోచిపెట్టే పని చేస్తున్నదని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నట్లు కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో తొలి రెండు రోజులు ఎలాంటి చర్చ లేకుండా ముగిశాయి.

**'సంచార్ సాథీ'పైనా విపక్షాల నిరసన**

దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ప్రీఇన్‌స్టాల్ (డిఫాల్ట్‌గా) చేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై విపక్షాలు మండిపడు తున్నాయి. పార్లమెంట్‌లో మంగళవారం ఈ అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ప్రశ్నోతరాల సమయంలో ఈ అంశాన్ని కాంగ్రెస్, శివసేన(యుబిటి), టిఎంసి సభ్యులు ప్రస్తావిస్తూ, ఇది ప్రజల ప్రైవసీ ఉల్లంఘనే అని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులంతా మూకుమ్మడిగా సంచార్ సాథీపై ఆందోళన చేపట్టడంతో సభా కార్యక్రమాలకు అడ్డుతగిలాయి. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. విపక్ష కాంగ్రెస్ దీని మీద వాయిదా తీర్మానం దాఖలు చేసి సంచార్ సాథీపై విస్తృత చర్చ కావాలని డిమాండ్ చేసింది. సంచార్ సాథీ యాప్.. ఫోన్ యూజర్ల కదలికల్ని, మెసేజెస్, కాల్స్ మానిటర్ చేస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. శివసేన యుబిటి ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ ఇది ఒక దారుణమైన పరిణామమని.. ఇది భవిష్యత్‌లో నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. ప్రజల గోప్యతను హరిస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోష్ కూడా దీనిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని విమర్శించారు. విపక్షాల ఆందోళన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరన్ రిజిజు.. సంచార్ సాథీ యాప్ పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. సంచార్ సాథీ మీద చర్చకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, కానీ అజెండా ప్రకారం సెషన్‌లో 14 బిల్లులపై ఫోకస్ పెడదామని సూచించారు.

# మందు తాగే వాళ్లకో దేవుడు..: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** మందు తాగే వాళ్లకో దేవుడు ఉన్నారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్య చేశారు. మంగళవారం గాంధీ భవన్‌లో పిసిసి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ డిసిసి నూతన అధ్యక్షులకు దిశా నిర్ధేశం చేశారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికే గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ ఉంది కాబట్టే నిలబడిందని, లేకపోతే జనతా పార్టీలా, మరో పార్టీలా మూతపడేదని అన్నారు. "హిందువులకు ఎంత మంది దేవతలు, దేవుళ్ళు ఉన్నారు?, మూడు కోట్ల మంది ఉన్నారా?" అని ఆయన అంటూ "పెళ్ళికాని వారికి హనుమంతుడు, రెండు పెళ్ళిళ్ళు చేసుకున్న వారికో దేవుడు, మందు తాగే వారికో దేవుడు, ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ కల్లు పోయాలి, కోడి కోయాలి అనోటోళ్ళకు, పప్పు తినే వారికో దేవుడు ఉన్నారు..అవునా, అన్ని రకాల దేవుళ్ళు ఉన్నారు..

అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేవుళ్ళపైనే ఏకాభిప్రాయం లేదని, అలాగే డిసిసి అధ్యక్షుల విషయంలో ఏకాభిప్రాయం ఎలా తేగలమని అన్నారు. తాను సిఎం కావడానికి చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. అదేవిధంగా మీరు కూడా కష్టపడాలని, కాంగ్రెస్‌లో ఏదైనా సాధ్యమని ఆయన తెలిపారు.

కాళ్ళలో కట్టే పెట్టే వారుంటారని ఆయన చెప్పారు. తాను ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నానని, అదిగో ముఖ్యమంత్రి బాల్‌ను కాలితో తన్నుతున్నారంటే ఎలా?, ఫుట్‌బాల్ అంటేనే కాలితో తన్నుతారని ఆయన అన్నారు. ఆటలో బోర్లా పడతామని, పడగానే ఇక లేవరని అనుకోరాదని, పడగానే లేచి నిలబడేవాడే ఆటగాడని ఆయన తెలిపారు. రాజకీయాల్లోనూ అదేవిధంగా ఉంటుంది కాబట్టి మీరంతా కష్టపడి పని చేయాలని డిసిసిలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిత బోధ చేశారు.

**హిందూ దేవుళ్లను రేవంత్‌రెడ్డి అవమానించారు : కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్**

హిందువులకు సంబంధించిన దేవీదేవతలను అవహేళన చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారపూరితంగా మాట్లాడిన మాటలను చాలా తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ప్రకటించారు.

ఒక హిందువుగా ఉంటూ, హిందువుల మీద, దేవీదేవతల మీద రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయం.ఇటీవలే జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో కూడా ఓట్ల కోసం దిగజారి కాంగ్రెస్ అంటే ముస్లింలు ముస్లింలు అంటే కాంగ్రెస్ అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడారు.

బహుశా, ఎంఐఎం సహవాస దోషం వల్లే రేవంత్ రెడ్డి హిందువుల మీద, దేవీదేవతల మీద బరితెగించి మాట్లాడుతున్నట్లున్నారు.తెలంగాణలో కూడా హిందువులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది. హిందువుల శక్తి ఏంటో రేవంత్ రెడ్డికి, యావత్ కాంగ్రెస్ పార్టీకి తెలియ జేయవలసిన సమయం ఆసన్నమైంది. ఏ ఓట్లతో అధికార పీఠమెక్కి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారో, ఆ ఓట్లతోనే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి పట్టిన మైకాన్ని, అహంకారాన్ని వదిలించాలి.

అధికార పీఠం నుంచి దించేయాలి. అందుకు తెలంగాణలోని హిందువులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హిందువులంటే కాంగ్రెస్‌కు ద్వేషమని, సిఎం రేవంత్ హిందూ దేవుళ్లను అవమానించారని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ఎంఐఎంకు మోకరిల్లిందని, తమడి ముస్లింల పార్టీ రేవంత్ కూడా అన్నారన్నారు.

# విద్యావాక్కు చట్టంలో సవరణలు చేయాలి

## పార్లమెంటులో ప్రశ్నించిన ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆందోళనను పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లారు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ.విద్యా హక్కు చట్ట సవరణ చేయాలని పార్లమెంటులో ప్రశ్నించారు. సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని.. తీర్పు ప్రకారం పదవీ విరమణకు ఇంకా ఐదేళ్లకు పైగా సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలోపు టెట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణులవ్వాలనీ పేర్కొంటూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. టెట్ క్వాలిఫై కాకపోతే.. తప్పనిసరిగా ఉద్యోగం కోల్పోవల్సి వస్తుందని.... ఐదేళ్ల కంటే తక్కువ సర్వీస్ ఉన్నవారు మాత్రం టెట్ లేకుండా కొనసాగవచ్చు.. కానీ వారికి ప్రమోషన్లకు అర్హత ఉండదని తీర్పులో పేర్కొన్నారని ఎంపీ డికె అరుణ అన్నారు. ఈ తీర్పు మూలంగా ఇన్‌సర్వీస్ టీచర్లు అనేక అవకాశాలు కోల్పోతున్నారని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీం తీర్పుతో దేశవ్యాప్తంగా ఉన్న 20 లక్షల మంది ఉపాధ్యాయులతో పాటు.. తెలంగాణలో సుమారు 40వేల మంది ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉపాధ్యాయులు తీరని అన్యాయానికి గురవుతున్నారని, వారి ఆందోళనను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్‌టిఈ) యాక్ట్- 2009కి సవరణ తీసుకురావాలని కేంద్రాన్నీ కోరారు ఎంపీ డీకే అరుణ. 2010కి ముందు ఉద్యోగం పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న ఆందోళన నేపథ్యంలో పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని ఎంపీ డీకే అరుణ కోరారు.

# ఎస్ఐఆర్‌పై 9, 10 తేదీల్లో చర్చను ఆహ్వానిస్తున్నాం

## భువనగిరి ఎంపి చామల

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఎస్.ఐ.ఆర్, ఎన్నికల కమీషన్ తీసుకుంటున్న ఎలక్టోరల్ రిఫార్మ్స్ పై 9,10 వ తేదీల్లో పార్లమెంట్‌లో పది గంటలు చర్చ చేపడతామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలోనే దీనిపై చర్చిస్తే విపక్షాలు ఆందోళన చేసేవి కావు అని ఆయన అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ లో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని మేము కోరుకుంటున్నామని ఎంపి అన్నారు. పార్లమెంట్ సమావేశాలను డిస్టబ్ చేయాలనే ఉద్దేశం మాకు లేదని చెప్పారు. ఎన్నికల కమీషన్ ఎస్.ఐ.ఆర్ ద్వారా ఓట్లను తొలగించే కుట్ర చేస్తుందని మేము చర్చ జరగాలని కోరితే ఎన్నికల సంఘం ఎస్.ఐ.ఆర్ తెచ్చిందని అన్నారు.

# మర్రి చెన్నారెడ్డి జీవితం నేటి యువతకు ఆదర్శం

## ఘాట్ వద్ద నివాళులు అర్పించిన స్పీకర్, ఛైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** మాజీ ముఖ్యమంత్రి,మాజీ గవర్నర్ మర్రి చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా పలువురు నేతలు నివాళులు అర్పించారు. ఇందిరా పార్క్ ఆవరణలో ఉన్న మర్రి చెన్నారెడ్డి ఘాట్ వద్ద పూలమాల వేసి తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ "మర్రి చెన్నారెడ్డి జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. ఆయన అనేక పదవులు చేపట్టి ప్రజలకు అనునిత్యం సేవ చేశారని కొనియాడారు. ఆనాడే ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీజం వేశారని వివరించారు.ఇరిగేషన్ విధానంలో వాటర్ షెడ్ డెవలప్మెంట్ పద్దతి అనేది ఆయన దూరదృష్టితో ఆనాడే అభివృద్ధి చేసారని, నేటికి అదే పద్దతిలో ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు.

# పంచాయతీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై డేగకన్ను

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** పంచాయతీ ఎన్నికల కోసం మూడో విడుత నామినేషన్ల ప్రక్రియ బుధవారం మొదలవుతున్న వేళ క్షేత్రస్థాయి పరిస్థితులపై తెలంగాణ వ్యాప్తంగా జిల్లా యంత్రాంగాలు ప్రత్యేక నిఘా పెడుతున్నాయి. పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం సాయంత్రానికల్లా తెలంగాణలో మొదటి విడత ఎన్నికలు జరిగే 4236గ్రామ పంచాయతీల్లో బరిలో ఉన్న సర్పంచ్ 37440వార్డులలో పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. గురువారం రోజు నుంచి నిర్వహించే ప్రచార ఘట్టాలకు సంబంధించి మండలానికో ప్రత్యేక పరిశీలకుడిని తెలంగాణ జిల్లాల్లో నియమించారు.12728 గ్రామాలలో ఈ మండలానికి ఒకరి చొప్పున నియమించబడిన అధికారి పర్యవేక్షణలోని బృందం సభ్యులు ప్రచారతీరు తెన్నులతోపాటు అభ్యర్థులు చేసే ఖర్చులపైన దృష్టి పెట్టనున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా వీడియో చిత్రీకరించనున్నారు. ఇందుకోసం మండలానికి ఇద్దరు చొప్పున సూక్ష్మ పరిశీలకులను నియమించనున్నారు. ఇప్పటికే 5 నుంచి 10 పంచాయతీలకు ఒక జోనల్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. మరోవైపు తెలంగాణ జిల్లాలో వ్యాప్తంగా గుర్తించిన సమస్యాత్మక కేంద్రాలపైన పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పోలింగ్ సిబ్బందికి సంబంధించి శిక్షణలు పూర్తయ్యాయి. ప్రతి 200ల మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారిని నియమిస్తున్నారు. అదే 400 ఓట్లపైబడిన గ్రామాల్లో ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వార్డుకు ఒక పోలింగ్ బూత్ తప్పనిసరిగా ఉంటుంది.1,12,242 బూత్‌లు ఉంటాయి. ప్రచారంలో డబ్బులు, మద్యం పంపిణీపై మండలం వారీగా ప్రత్యేక పరిశీలకులు నిఘా పెడతారు.చీరల పంపిణీ, సంఘాలకు నజరానాలను ప్రకటించడం, యువతకు కానుకలిచ్చే వాటిపై దృష్టి సారింపుఓటర్లను ప్రభావితం చేసే చర్యలను గమనిస్తారు. అనుమతి లేకుండా స్పీకర్ల వాడకంపై కన్నేస్తారు.పోలింగ్ ముగిసే సమయానికి 44 గంటల ముందే ప్రచారాన్ని ఆపకుండా కొనసాగిస్తే చర్యలుంటాయి.ఎన్నికల కరపత్రాలు, ముద్రణ, ప్రచురణలతోపాటు అభ్యర్థుల ఖర్చుపైన తగిన దృష్టిని సారిస్తారు. 49 వేల రూపాయలు మించి నగదు తీసుకొని ప్రయాణం చేయకుండా ఉండాలి.

# సోనియా, రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

## రాజకీయ ప్రతీకార చర్య: మంత్రి జూపల్లి


**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై కొత్త ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడాన్ని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. రాజకీయ ప్రతీకార చర్యగా దీన్ని అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తపరచడం నేరం కాదు. ప్రజల కోసం, దేశ భవిష్యత్తు కోసం పోరాడుతున్న నాయకులపై ఇలా కేసులు నమోదు చేయడం అంగీకారయోగ్యం కాదు అన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడానికి చేసిన రాజకీయ ప్రయత్నం. కాంగ్రెస్ పార్టీ, నాయకుల పట్ల ప్రజల్లో ఉన్న అపారమైన విశ్వాసాన్ని దెబ్బతీయాలని చేసే నిష్ఫల ప్రయత్నమిదని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

# పార్లమెంట్ డ్రామా సెంటర్ లాగా మారిపోయింది

## ప్రధాని మోడీ, ఎన్డీయే సర్కారుపై ఎంపి మల్లు రవి ధ్వజం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** పార్లమెంట్ డ్రామా సెంటర్ లాగా మారిపోయిందనినాగర్ కర్నూల్ ఎంపి డా.మల్లు రవి వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి ఎంపిలం అందరం ఎస్ఐఆర్ పైన చర్చ జరపాలని కోరుతుంటే.ఎన్డీయే సర్కారు భయపడుతోందన్నారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మల్లు రవి మంగళవారం విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.ఇండియా కూటమికి చెందిన ఎంపిలం అందరం.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై చర్చ జరగాలని కోరుతున్నామని చెప్పారు. చర్చ కావాలని అడిగిన ప్రతీసారి సభను వాయిదా వేస్తున్నారనిఆవేదన వ్యక్తంచేశారు.

# మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్‌లో భారత్ ఓటమి



**న్యూఢిల్లీ:** మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్, గ్రూప్ దశలో భారత్ విజయం లేకుండా ఓడిపోయింది. చెంగ్డులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి పాలవడంతో మానవ్‌స్వస్తిక జోడి ఒక్కటే ఆశాకిరణమయ్యాడు. చైనాలోని చెంగ్డులో మంగళవారం జరిగిన మూడవ మరియు చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైన తర్వాత భారత్ 2025 ఐటిటిఎఫ్ మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్ నుండి నిష్క్రమించింది. వారం రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత జట్టు ఆస్ట్రేలియా చేతిలో 5-8 తేడాతో ఓడిపోవడంతో ఒక్క టై కూడా విజయం సాధించలేకపోయింది. ఆస్ట్రేలియాతో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో మానవ్ ఠక్కర్ మరియు స్వస్తిక ఘోష్ 2-1 (11-6, 2-11, 11-7) తేడాతో హ్వాన్ బే-కానాంటినా సైహోగియోస్‌పై విజయం సాధించడంతో భారత ప్యాడ్లర్లు బలమైన జోరుతో ప్రారంభించారు. 20 ఏళ్ల యశస్విని ఘోర్పడే యాంగ్జీ లియు చేతిలో 1-2 (12-10, 3-11, 8-11) తేడాతో ఓడిపోయింది, ఆస్ట్రేలియా స్కోరును 3-3తో సమం చేసింది. మ్యాచ్ సమంగా ఉండటంతో, భారం ఒలింపియన్ సత్యన్ జ్ఞానశేఖరన్‌పై పడింది. కానీ అతను కూడా విఫలమయ్యాడు, ఫిన్ లుయు చేతిలో 1-2 (10-12, 9-11, 11-0) తేడాతో ఓడిపోయాడు. కామన్వెల్త్ గేమ్స్ పతక విజేత మానికా బాత్రా-దియా చిటాలే కూడా మహిళల డబుల్స్ పోరులో కాన్స్టాంటినా సైహోగియో-యాంగ్జీ లియు చేతిలో 1-2 (11-8, 7-11, 8-11) తేడాతో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ జోడీ ఆకాష్ పాల్ మరియు పయాస్ జైన్ కూడా హ్వాన్ బేఫిన్ లుయు చేతిలో 0-1 (9-11) తేడాతో ఓడిపోయారు.

# ఐపిఎల్ నుండి విధ్వంసకర ప్లేయర్ రిటైర్డ్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 మినీ వేలం ఈ నెల 16న జరగనుంది. ఈ వేలంలో పాల్గొనడానికి 1,355 మంది ఆటగాళ్లు రిజిస్టర్ చేసుకున్నారు. కానీ ఆశ్చర్యకరంగా వచ్చే ఐపీఎల్ నుంచి విధ్వంసకర బ్యాట్స్‌మెన్, స్టార్ ప్లేయర్ ఆస్ట్రేలియన్ ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ రిటైర్ అయ్యి షాక్‌కు గురి చేశాడు. వాస్తవానికి ఈ స్టార్ ప్లేయర్ రిజిస్టర్డ్ ఆటగాళ్ల జాబితాలో చేరలేదు. ఐపీఎల్ 2026కి దూరంగా ఉండాలనే నిర్ణయంతో వేలంలో తన పేరును నమోదు చేసుకోలేదు. గ్లెన్ మాక్స్‌వెల్ 2025లో పంజాబ్ కింగ్స్ తరుఫున మైదానంలోకి దిగాడు. ఈ ఫ్రాంచైజీ మాక్స్‌వెల్ను రూ.4.2 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఈ వేలానికి ముందు పంజాబ్ మాక్స్‌వెల్‌ను విడుదల చేసింది. మాక్స్‌వెల్ పంజాబ్ జట్టు నుంచి బయటికి వచ్చిన తర్వాత, చాలా ఫ్రాంచైజీలు ఈ స్టార్ ప్లేయర్స్‌పై కన్నేశాయి. కానీ ఆయన మాత్రం ఈ వేలంలో తన పేరును నమోదు చేసుకోలేదు. ఐపీఎల్ టోర్నమెంట్లో మాక్స్‌వెల్ ఇప్పటి వరకు 4 జట్ల తరపున మొత్తం 13 సీజన్లు ఆడాడు. ఈ స్టార్ ప్లేయర్ 2012లో ఐపీఎల్ లోకి అడుగుపెట్టాడు. అప్పటి నుంచి ఐపీఎల్ ద్వారా సుమారు రూ.92 కోట్లు (సుమారు 1.25 బిలియన్) సంపాదించినట్లు సమాచారం. 2021లో ఈ స్టార్ ప్లేయర్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు కొనుగోలు చేసినప్పుడు మాక్స్‌వెల్ అత్యధిక జీతం రూ.14.25 కోట్లు (సుమారు 1.425 బిలియన్) అందుకున్నాడు. ఇక ఇటీవల కాలంలో వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్లో ఆడట్లేదని పలువురు విదేశీ స్టార్ ప్లేయర్లు ప్రకటించారు. రిటైర్మెంట్ ప్రకటించిన వారిలో వెస్టిండీస్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్, సౌతాఫ్రికా స్టార్ ఫాఫ్ డుప్లెసిస్, ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ ఉన్నారు.

## సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో..

# హార్ధిక్ విధ్వంసం

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా తన ప్రొఫెషనల్ క్రికెట్ రీ ఎంట్రీలో అదరగొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025లో బరోడా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న హార్దిక్ మంగళవారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో దుమ్ము రేపాడు. ఆసియా కప్2025లో గాయపడిన తర్వాత పాండ్యా తిరిగి మైదానంలో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. తన పునరాగమనంలో పాండ్యా బంతితో రాణించలేక పోయినప్పటికీ బ్యాట్‌తో మాత్రం




విధ్వంసం సృష్టించాడు.. 225 పరుగుల లక్ష్య ఛేదనలో ప్రత్యర్థి బౌలర్లను హార్దిక్ ఉతికారేశాడు. తన న్నింగ్స్‌ను నెమ్మదిగా మొదలుపెట్టినప్పటికీ క్రీజులో సెటిల్ అయ్యాక ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 42 బంతుల్లో 78 ఫోర్లు, 4 సిక్స్‌లతో 77 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు, విష్ణు సోలంకి (43), శివాలిక్ శర్మ (47) మెరుపులు మెరిపించాడు. ఇక 225 పరుగుల లక్ష్యాన్ని బరోడా కేవలం 3 వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్లలో ఛేదించింది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 52 పరుగులిచ్చి కేవలం ఒకే వికెట్ పడగొట్టాడు.



# సౌతాఫ్రికాతో నేడు రెండో వన్డే

## పంత్‌కు చోటు.. నితీష్‌కుమార్‌పై వేటు

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్దమైంది. బుధవారం రాయ్‌పూర్ వేదికగా జరిగే రెండో వన్డేలో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలి వన్డే తరహాలోనే రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని టీమిండియా భావిస్తోంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే యోచనలో ఉంది. మరోవైపు తొలి వన్డేలో తృటిలో విజయాన్ని చేజార్చుకున్న సౌతాఫ్రికా, రెండో మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్ రేసులో నిలవాలనే పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీతో చెలరేగడం, రోహిత్ శర్మ హాఫ్ సెంచరీతో సత్తా చాటడంతో అప్‌కమింగ్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి వన్డేలో రిషభ్ పంత్‌ను పక్కనపెట్టి రుతురాజ్ గైక్వాడ్‌ను ఆడించడం విమర్శలకు దారి తీసింది. ఈ అవకాశాన్ని రుతురాజ్ గైక్వాడ్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతను దేశవాళీ క్రికెట్ ఫామ్‌ను కొనసాగించలేకపోయాడు. అయితే రుతురాజ్ గైక్వాడ్‌కు మరో అవకాశం ఇస్తారా లేక రిషభ్ పంత్‌ను తుది జట్టులోకి తీసుకొస్తారా అనేది చూడాలి. ఒకవేళ పంత్‌ను ఆడించాలనుకుంటే రుతురాజ్ బెంచ్‌కు పరిమితమవుతాడు. ఈ ఒక్క మార్పు మినహా తుది జట్టును మార్చే అవకాశాలు లేవు. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి వన్డేలో యశస్వి జైస్వాల్ నిరాశపర్చాడు. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో అతనికి వచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా అతను సత్తా చాటాలి. మరోవైపు రోహిత్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఫస్ట్ డౌన్‌లో విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నాడు. తొలి వన్డేలో అద్భుత శతకంతో కోహ్లీ రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాడు. నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్, రిషభ్ పంత్‌ల్లో ఒకరు బరిలోకి దిగనున్నారు. వాషింగ్టన్ సుందర్ ఐదో స్థానంలో, కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నారు. సుందర్ విఫలమైనా రాహుల్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఏడో స్థానంలో జడేజా దూకుడుగా ఆడి విలువైన పరుగులు జోడించాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడనుండగా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణలు పేసర్లుగా కొనసాగనున్నారు. తెలుగు తేజం నితీష్ కుమార్‌తో పాటు ధ్రువ్ జురెల్, తిలక్ వర్మకు నిరాశే ఎదురవ్వనుంది.

## మహిళల వరల్డ్ కప్..

# నమీబియాను ఓడించిన భారత్

**న్యూఢిల్లీ:** మహిళల జూనియర్ ప్రపంచ కప్ 2025, ప్రారంభ మ్యాచ్‌లో భారతదేశం నమీబియాను ఓడించింది. శాంటియాగోలో జరిగిన టోర్నీలో నమీబియాపై 13-0 తేడాతో భారత హాకీ జట్టు తమ ప్రచారాన్ని ప్రారంభించింది. హినా బానో (35వ నిముషం, 35, 45) మరియు కనికా సివాచ్ (12, 30, 45) హ్యాట్రిక్‌లు సాధించగా, సాక్షిరాణా (10, 23) రెండు గోల్స్ సాధించారు. బినిమా ధన్ (14), సోనమ్ (14), సాక్షిశుక్లా (27), ఇషిక (36), మనీషా (60) కూడా గోల్స్ షీట్‌లో ఉన్నారు. ఈ పోటీ ప్రారంభం నుంచే భారత్ ముందంజలో ఉండి మొదటి క్వార్టర్ ముగియడానికి 6 నిమిషాలు ఉండగానే పెనాల్టీ కార్నర్‌ను సాధించింది. రాణా (10) అద్భుతమైన రివర్స్ ఫ్లిక్ తో స్కోరింగ్ ప్రారంభించగా, కనికా సివాచ్ (12) ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. బినిమా ధన్ (14) పదునైన పరుగు మరియు ముగింపుతో మూడో గోల్ చేసింది, అయితే సోనమ్ (14) ఇంటర్‌ప్లే తర్వాత నాల్గవ గోల్ చేసింది. తొలి పదిహేను నిమిషాల తర్వాత భారత్‌కు 4-0 ఆధిక్యాన్ని అందించింది. రాణా (23) అద్భుతమైన రెండవ గోల్ చేయడంతో భారత్ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఓపెనింగ్ కోసం నమీబియా కొంత దూకుడుగా ఆడింది, కానీ భారత మిడ్‌ఫీల్డర్ల ఆధిపత్యం నిరంతరం వారిని దూరంగా ఉంచింది. శుక్లా (27) పెనాల్టీ ఆర్నర్‌ను డ్రాగ్‌ఫ్లిక్‌గా మార్చడంతో భారత్ ఆరో గోల్ చేసింది. కనికా సివాచ్ (30) కూడా హాఫ్ టైమ్ స్ట్రోక్‌లో 2వ గోల్ చేసి ఆధిక్యాన్ని 7-0కి పెంచింది. హినా బానో (35) టాప్ కార్నర్‌లోకి భీకరమైన స్ట్రైక్‌తో టోర్నమెంట్‌లో తన మొదటి గోల్ చేసింది. గోల్ లేని నాల్గవ క్వార్టర్‌లో నమీబియా తీవ్రంగా పోరాడింది. అయితే, మనీషా (60ఖ) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసింది, తొలి ఆటలో భారతదేశం 13-0తో ఆధిక్యంలో నిలిచింది.



# ఆరునెలల్లో ఎఫ్‌డిఐలు

# 43.37 బిలియన్ డాలర్లు




**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** విదేశీ పెట్టుబడులు మొదటి ఆరునెలలకాలంలో భారత్‌కు 50.36 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఇదే ఏడాది క్రితం ఆరునెలల్లో 43.37 బిలియన్ డాలర్లు రాబట్టినట్లు పెట్టుబడులు ఉపసంహారణ విభాగం ప్రకటించింది. 2012-13లో కేవలం 34 బిలియన్‌డాలర్లు మాత్రమే ఉండేవని 2024-25లో అయితే సుమారు 80 బిలియన్ డాలర్లవరకూ వచ్చినట్లు కేంద్ర మంత్రి జితిన్‌ప్రసాద్ తెలిపారు. ఎఫ్‌డిఐలు రెండోత్రైమాసికంలో 18శాతం పెరిగాయి. 35.18 బిలియన్ డాలర్లుగాఉన్నట్లు మంత్రి వివరించారు. విదేశాల నుంచి వస్తున్న ప్రత్యక్ష పెట్టుబడులు పెరగడమే ఇందుకు కారణం అని తేలింది. అలాగే ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ నిబంధనలు 2022లోనే సరళీకృతం అయ్యాయి. ఈ పెట్టుబడులు రానున్నకాలంలో భారత్‌ను మరింత పటిష్టంచేస్తాయని జితిన్‌ప్రసాద వివరించారు. దీనికితోడు భారత్‌కూడా ఎగుమతులు ప్రోత్సాహకాలు, పెట్టుబడుల వికేంద్రీకరణలకారణంగా మరింతగా ఆకర్షిస్తోందని, 15 స్వేఛ్ఛా వాణిజ్యఒప్పందాలు జరిగాయని, ఆరు ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందాలు కూడా వివిధ దేశాలతో జరిగినట్లు వివరించారు.

యూరోపియన్ ఫ్రీట్రేడ్ అసోసియేషన్‌తో గత ఏడాది మార్చిలోనే ఒప్పందం జరిగిందన్నారు. వచ్చే 15 ఏళ్లలో పదిలక్షల మంది ఉపాధికల్పించడంతోపాటు యూరోపియన్ దేశాలనుంచి 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. స్విస్, నార్వే, లీచెస్టీన్, ఐస్‌ల్యాండ్ వంటి దేశాలతో ఒప్పందాలు జరిగాయన్నారు. అలాగే ఎఫ్‌టిఎలు యూరోపియన్ యూనియన్‌తోపాటు పెరూ,చిలీ, న్యూజిలాండ్; ఓమన్ వంటి గల్ఫ్‌దేశాలతో కూడా జరిగాయని ఎగుమతుల ప్రోత్సాహక మండళ్లతోను, పరిశ్రమల సంఘాలతోను ప్రభుత్వాలతోను కూడా భారత్ సంప్రదింపుల కారణంగా పెట్టుబడులు పెరుగుతున్నట్లు మంత్రి వివరించారు.

# రెండోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలే!

## అమ్మకాలతో ట్రేడర్లు బిజీ




**ముంబయి, డిసెంబరు 2:** స్టాక్ మార్కెట్లలో కీలక సూచీలు స్వల్పనష్టాల్లోనే ముగిసాయి. రెండోసారి వరుసగా సెన్సెక్స్,నిఫ్టీలు క్షీణించాయి. డాలరుతో రూపాయి ఆల్‌టైమ్ కనిష్టానికి చేరుకోవడం, విదేశ ఈపెట్టుబడులు విత్‌డ్రా వంటివి మార్కెట్లలో అనిశ్చితిని పెంచింది. అలాగే అమెరికాతో వాణిజ్య చర్చలు కూడా స్పష్టత రాకపోవడం కూడా ఒక కారణం కాగా ఐపివో కేలండర్‌తోపాటు ఆర్బీఐ మానిటరీ కమిటీ రేట్‌కట్‌లు వంటి వాటిపై ఇన్వెస్టర్లు ఆసక్తిచూపించారు. బిఎస్‌ఇ సెన్సెక్స్ 503.63 పాయింట్లు క్షీణించి 85,138.27 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 0.15శాతం క్షీణించి 143.55 పాయింట్లు పతనంతో 26,032.20 పాయింట్లవద్ద లావాదేవీలు నిలిపివేసింది. బిస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.19శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.05శాతం క్షీణించాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1847 షేర్లు పెరిగితే 2400 షేర్లు దిగజారాయి. 210 కంపెనీల షేర్లుస్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 89.97వద్ద కొనసాగింది.

ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 0.44శాతం క్షీణించి రూ.1,26,750వద్ద స్థిరపడింది. బ్రెంట్ ముడిచమురు జనవరి సెటిల్‌మెంట్‌వద్ద 15 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 63.02 డాలర్లుపలికింది. నిఫ్టీ బ్యాంక్‌సూచీ 0.68శాతం క్షీణించింది. ఐసిఐసిఐబ్యాంకు 1.17శాతం, హెచ్‌డిఎఫ్‌సి 1.07, యాక్సిస్ బ్యాంకు 1.05శాతం, ఎస్‌బిఐ 0.33శాతం క్షీణించాయి. మిని డైమండ్స్ ఇండియా 19.96శాతంపెరిగింది. ఆదాని పోర్టులు ఎస్ఇజెడ్‌లు 0.95శాతం క్షీణించాయి. హీరోమోటకార్ప్ కూడా 0.40శాతంపతనం అయితే ఎన్ఎండిసి 0.92శాతం పెరిగింది. ఫోర్స్ మోటార్స్‌కూడా 1.99శాతం, భారత్ డైనమిక్స్ 0.27శాతం చొప్పున క్షీణించాయి.

## ఇండిగో మాతృసంస్థకు

# జిఎస్టీ షాక్



**కోచ్చి, డిసెంబరు 2:** విమానసంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు జీఎస్టీ విభాగం నుంచి భారీ షాక్ తగిలింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి) నిబంధనలకు సంబంధించి కొచ్చి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ రూ. 117.52కోట్ల జరిమానా విధించింది. కంపెనీ మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. 2018-19, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి కంపెనీ క్లెయిమ్ చేసిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను జీఎస్టీ అధికారులు తిరస్కరించారు. ఈ నేపథ్యంలోనే రూ. 1,17,52,86,402 జరిమానాతో పాటు డిమాండ్ ఆర్డర్ జారీ చేసినట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తన ఫైలింగ్‌లో పేర్కొంది. అధికారుల ఆదేశాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, దీనిపై న్యాయపరంగా తమకు గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది. పన్ను నిపుణుల సలహాతో ఈ ఆదేశాలను ఉన్నత అధికారిక ఫోరంలో సవాలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ జరిమానా ప్రభావం కంపెనీ ఆర్థిక వ్యవహారాలు, కార్యకలాపాలపై పెద్దగా ఉండబోదని కూడా వివరించింది. ఈవార్తల నేపథ్యంలో ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు ధర రూ.95 (1.64%) మేర తగ్గింది. మరోవైపు ఇవాళ ఉదయం కువైట్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దాన్ని ముంబైకి మళ్లించిన విషయం తెలిసిందే.





## పరారీలో ఉన్న ఆర్థికనేరగాళ్ల బకాయిలు

# రూ.58,082 కోట్లు

## పార్లమెంటులో డిప్యూటీ ఆర్థికమంత్రి వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** ప్రముఖ వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోడీ వంటి ఆర్థిక నేరగాళ్లు ప్రభుత్వ బ్యాంకులకు పెట్టిన టోపీ భారీ మొత్తంలోనే ఉంది. దేశం విడిచి పారిపోయిన మొత్తం 15 మంది ఆర్థిక నేరస్థులు ప్రభుత్వ బ్యాంకులకు ఏకంగా రూ.58,082 కోట్లు బకాయి పడినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ మొత్తం బకాయిల్లో అసలు మొత్తం రూ.25,645 కోట్లు కాగా, దానిపై వడ్డీ రూ.31,437 కోట్లకు చేరిందని మంత్రి వివరించారు. ఇప్పటి వరకు ఈ నేరగాళ్ల ఆస్తుల నుంచి 33 శాతం అంటే రూ.19,187 కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.38,895 కోట్లు రాబట్టాల్సి ఉందని చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా మొత్తం 12 ప్రభుత్వ రంగ బ్యాంకులకు వీరు ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. ఈ జాబితాలో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధినేత విజయ్ మాల్యా రూ.11,960 కోట్లతో మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన ఒక్క స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకే ఈ మొత్తం చెల్లించాల్సి ఉంది. ఆయన తర్వాత వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.6,799 కోట్లు బకాయి పడ్డారు. వీరితో పాటు సందేశారా గ్రూప్ కూడా రూ.900 కోట్ల నుంచి రూ.1300 కోట్ల వరకు అప్పులు తీసుకున్నట్లు తేలింది.



## యాపిల్ ఎఐ విభాగం సిఇఒగా

# అమర్ సుబ్రమ్మాణ్య

**సియాటెల్, (యుఎస్), డిసెంబరు 2:** టెక్ దిగ్గజం యాపిల్ తమ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో కీలక మార్పులు చేసింది. సంస్థ ఎఐ విభాగానికి అధిపతిగా భారత సంతతికి చెందిన అమర్ సుబ్రమణ్యను నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న జాన్ జియానాంద్రియా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. యాపిల్ ఫౌండేషన్ ఎఐ మోడల్స్, మెషీన్ లెర్నింగ్ రీసెర్చ్ కార్యకలాపాలను ఇకపై అమర్ పర్యవేక్షిస్తారు. ఎఐ రంగంలో అమర్ సుబ్రమణ్యకు అపార అనుభవం ఉంది. గతంలో ఆయన మైక్రోసాఫ్ట్‌లో ఎఐ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. అంతకుముందు సుమారు 16 ఏళ్ల పాటు గూగుల్‌లో సేవలందించారు. అక్కడ జెమిని అసిస్టెంట్ ఇంజనీరింగ్ విభాగానికి ఆయన నేతృత్వం వహించారు. ఇక, జాన్ జియానాంద్రియా వచ్చే ఏడాది తన పదవీవిరమణవరకు యాపిల్‌లో సలహాదారుగా కొనసాగుతారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో యాపిల్ ప్రస్తుతం వెనుకబడినట్లు టెక్ వర్గాలు భావిస్తున్నాయి. ఐఫోన్లకు ఎఐ ఫీచర్లను జోడించడంలో జాప్యం జరుగుతుండటమే దీనికి కారణం. మరోవైపు, యాపిల్ ప్రధాన ప్రత్యర్థి శాంసంగ్ ఇప్పటికే తన ఫోన్లలో అనేక ఎఐ ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో, యాపిల్ వాయిస్ అసిస్టెంట్ సిరికి ఎఐ మెరుగులు దిద్దే ప్రక్రియకూడా వచ్చేఏడాదికి వాయిదా పడింది. ఈ నేపథ్యంలోనే యాపిల్ ఈ కీలక నియామకం చేపట్టినట్లు తెలుస్తోంది.

# భారత్ మార్కెట్‌లో వెనకబడిన 'టెస్లా'




**న్యూఢిల్లీ,డిసెంబరు 2:** ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా, భారత మార్కెట్లో అంతగా ఆకర్షించలేదు. సెప్టెంబర్‌లో డెలివరీలు మొదలుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం 157 కార్లను మాత్రమే విక్రయించింది. ప్రభుత్వ వాహన్ పోర్టల్ గణాంకాల ప్రకారం నవంబర్ నెలలో కేవలం 48 కార్లను మాత్రమే విక్రయించి, పోటీదారుల కంటే వెనుకబడింది. భారత లగ్జరీ కార్ల మార్కెట్లో ఇప్పటికే పట్టు సాధించిన బీఎండబ్ల్యూ, నవంబర్‌లో ఏకంగా 267 ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది. ఈ గణాంకాలు టెస్లా ఎదుర్కొంటున్న తీవ్రమైన పోటీని స్పష్టం చేస్తున్నాయి. అమెరికాకు చెందిన ఈ సంస్థ, మోడల్ వై ఎలక్ట్రిక్ ఎస్‌యూవీతో భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఆరంభంలో భారీ అంచనాలు ఉన్నప్పటికీ, అమ్మకాల సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. అమ్మకాలు నెమ్మదిగా ఉన్నప్పటికీ టెస్లా తన విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేస్తోంది. గతవారం గురుగ్రామ్‌లోని ఆర్కిడ్ బిజినెస్ పార్క్‌లో మొట్టమొదటి ఆల్ ఇన్ వన్ టెస్లా సెంటర్‌ను ప్రారంభించింది.

ఇక్కడే రిటైల్, సర్వీస్, డెలివరీ, ఛార్జింగ్ సదుపాయాలను ఒకేచోట అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్ మాట్లాడుతూ, ఉత్తర భారతంలో టెస్లా కమ్యూనిటీకి మద్దతుగా ఈ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా వినియోగదారుల్లో నమ్మకాన్ని పెంచి, ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ కొత్త సెంటర్‌లో మోడల్ వై టెస్ట్ డ్రైవ్ చేయడంతో పాటు అత్యాధునిక ఇ4 సూపర్ ఛార్జర్లను, కంపెనీకి చెందిన హ్యూమనాయిడ్ రోబోట్ ఆప్టిమస్ జెన్ 2ను కూడా ప్రదర్శనకు ఉంచారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.